నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
18వ
కాకినాడ జిల్లా | తూర్పుగోదావరి జిల్లా
కోనసీమ జిల్లా | అల్లూరి సీతారామరాజు జిల్లా
బుధవారం,11 డిసెంబర్ 2024


## నాగబాబుకు మంత్రి పదవి ప్రకటించినందుకు సంబరాలు



**కాకినాడ,మేజర్‌న్యూస్ :** జనసేన ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబును రాష్ట్ర మంత్రివర్గంలోకి తీసుకుంటున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించడం పట్ల నగరంలోని పలు డివిజన్లకు చెందిన జనసైనికులు ఘనంగా సంబరాలు చేసుకున్నారు. జనసేన కాకినాడ పార్లమెంట్ ఎన్నికల కమిటీ ఇన్చార్జి డా. మల్లాడి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో ఈ సంబరాలు జరిగాయి. ఆయన మాట్లాడుతూ నాయకులను, కార్యకర్తలను ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ జనసేన పార్టీని శక్తివంతంగా తీర్చిదిద్దడంలో నాగబాబు పాత్ర వెలకట్టలేనిదని, ఆయన మంత్రిపదవి అలంకరించడం అంటే ప్రతీ జనసైనికుడుకి ఆత్మగౌరవం దక్కినంత సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్తులో నాగబాబు మరింత ఉన్నత పదవులు అలంకరించి ప్రజలకు మరింత సేవలు అందించాలని ఆకాంక్షిస్తున్నామన్నారు. ఈ మేరకు జగన్నాధపురం రామాలయం వీధిలోని ఆయన ఇంటి వద్ద నాగబాబుకు శుభాకాంక్షలు తెలుపుతూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ వద్ద జనసైనికులు బాణసంచా, టపాసులు కాల్చి సందడి చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు, డిప్యూటీ ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్టు మల్లాడి తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసైనికులు దుర్గాప్రసాద్, వెంకట సూర్య, యశ్వంత్, సాగర్, బాలు, వీరపండు, సాయికుమార్, నాగేంద్ర, పోతురాజు, నరసింహమూర్తి, మురళీ, వీరబాబు, మణికంఠ, కౌశిక్, హేమంత్, శేఖర్, ప్రేమ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# రెవెన్యూ సదస్సుల్లో సమస్యల పరిష్కారానికి చర్యలు

### – ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం





**రంపచోడవరం,మేజర్‌న్యూస్ :** ఏజెన్సీ ప్రాంతంలో 7గిరిజన మండలాల పరిధిలోని గ్రామాలలో రెవిన్యూ సదస్సులు ఏర్పాటు చేయడం జరుగు తుందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం పేర్కొన్నారు.స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో అన్ని మండలాలకు సంబంధించిన తాసిల్దార్లు, డిప్యూటీ తాసిల్దార్లు, మండల రెవెన్యూ అధికారులు,మండలసర్వేయర్లు,గ్రామ సచివాలయాలకు సంబంధించిన సర్వేయర్లు, వీఆర్వోలతో రెవిన్యూ సదస్సు శిక్షణ తరగతులు సమావేశం రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం, రంపచోడవరం సబ్‌కలెక్టర్ కె.ఆర్.కల్పశ్రీమంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటుచేసిన రెవిన్యూ సదస్సులు ద్వారా నిబంధనలు ప్రకారం భూసమస్యలు పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో 1/70 చట్టం ద్వారా ఈ ప్రాంతంలోని గిరిజనులకు నిబంధనలు అనుసరించి గిరిజన సమస్యలు పరిష్కరించడం జరుగుతుందన్నారు. గిరిజన ప్రాంతంలో గిరిజనులకు న్యాయం చేసే విధంగా సమస్యలు పరిష్కరించడం జరుగుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అర్హులైన తెల్ల రేషన్ కార్డు లబ్ధిదారులకు ప్రతీనెల రేషన్ బియ్యం సకాలంలో అందేవిధంగా ఎప్పటికప్పుడు పరిశీలించాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. ఎక్కడైనా రేషన్ బియ్యం కొంటే వారిపై కేసులు పెట్టాలని, అదేవిధంగా రేషన్ బియ్యం అమ్మినవారిపై చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. సమావేశంలో రంపచోడవరం సబ్ కలెక్టర్ కె.ఆర్.కల్పశ్రీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏజెన్సీలో భూ సమస్యలు పరిష్కరించే విధంగా ఈనెల 13వ తేదీ నుండి 2025 జనవరి 8వ తేదీ వరకు రెవిన్యూ సదస్సులు షెడ్యూల్ ప్రకారం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ప్రతీ గ్రామంలో రెవిన్యూ సదస్సులు ఒక ప్లాను ప్రకారం ఏర్పాటు చేయాలని అన్ని మండలాల తాసిల్దారులను ఆమె ఆదేశించారు. రెవిన్యూ సదస్సులు నిర్వహించే గ్రామాలలో రెండు రోజులు ముందుగానే ఆయా గ్రామ ప్రజలకు తెలియజేసి అదేవిధంగా టామ్ టామ్ వేయించాలని ఆమె అన్నారు. గ్రామసభలు నిర్వహించే గ్రామాలలో ఎక్కువమంది ప్రజలు వచ్చే విధంగా గిరిజనులకు అవగాహన కల్పించాలన్నారు. చట్టం ప్రకారం ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులకు మాత్రమే భూములపై హక్కులు ఉంటాయన్నారు. ఒక్కొక్క విఆర్ఓకు సుమారు ఎన్ని గ్రామాలలో రెవిన్యూ సదస్సులు నిర్వహించవలసి ఉంటుందో ఆమె ఆరా తీశారు.

ఏజెన్సీలో గిరిజనులకు దగ్గర్లో ఉండేది వీఆర్వో లేనని, వీఆర్వోలు గిరిజన ప్రజలకు న్యాయం చేస్తే ప్రజల్లో మంచి గుర్తింపు ఉంటుందన్నారు. ఏజెన్సీలో విఆర్వోలు వారి పరిధిలో చాలావరకు సమస్యలు పరిష్కరించవచ్చునన్నారు. బ్యాంకు మేనేజర్లకు రెవెన్యూ సదస్సుల గురించి తెలియపరచాలని ఆమె అన్నారు. ప్రభుత్వ భూములు, ప్రైవేట్ భూములకు సంబంధించిన వివరాలు రెవిన్యూ సదస్సులో డిస్ప్లే చేయాలనన్నారు. భూములకు సంబంధించిన సమస్యల దరఖాస్తులన్నీ అప్లోడ్ చేయాలని,అదేవిధంగా వచ్చిన దరఖాస్తులకు రసీదులు ఇవ్వాలన్నారు. దరఖాస్తుదారులు ఆధార్ కార్డుతో దరఖాస్తులు సమర్పించాలని ఆమె అన్నారు. అన్ని మండలాల గ్రామాలలో జరుగు రెవిన్యూ సదస్సులకు సంబంధించిన దరఖాస్తులను రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు.అన్ని గ్రామ సభలకు సంబంధించిన దరఖాస్తులను డిజిటల్ అసిస్టెంట్‌లు అప్లోడ్ చేయాలన్నారు. రెవెన్యూ సదస్సులకు సంబంధించి సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. ఈ నెల 13వ తేదీ నుండి వచ్చే జనవరి ఎనిమిదో తేదీ వరకు జరుగు రెవిన్యూ సదస్సులు నిబంధనలు, షెడ్యూల్ ప్రకారం నిర్వహించే బాధ్యత సంబంధిత అధికారులపై ఉందన్నారు. రెవెన్యూ సదస్సులకు సంబంధించిన శిక్షణలో అన్ని పూర్తిగా అవగాహన చేసుకుని రెవిన్యూ సదస్సులు పగడ్బందీగా నిర్వహించాలని అన్ని మండలాలకు సంబంధించిన రెవెన్యూ అధికారులను సబ్ కలెక్టర్ తెలిపారు. రెవిన్యూ సదస్సులు ఏర్పాటు చేసే గ్రామ సభలలో రెవిన్యూ సదస్సులకు సంబంధించిన బ్యానర్లు ఎక్కడికక్కడ ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్లు రామకృష్ణ, వేణుగోపాల్, సిహెచ్ శ్రీనివాసరావు, కరక సత్యనారాయణ, కె.సూర్యనారాయణ, ఏ.ఎస్.వి.సత్యనారాయణ, బాలాజీ, అన్ని మండలాలకు సంబంధించిన డిప్యూటీ తాసిల్దారులు, మండల సర్వేయర్లు, సచివాలయాలకు సంబంధించిన సర్వేర్లు, వీఆర్వోలు, మండల రెవిన్యూ ఇన్స్పెక్టర్లు, డిజిటల్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## రహదారుల తీరుపై సభ్యుల ధ్వజం



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** ఆర్ అండ్ బి రహదారులు ఎక్కడికక్కడ అక్రమణాలకు గురికావడంతో పాటు ప్రయాణానికి అనువుగా లేకుండా ధ్వంసం అయ్యాయని పలువురు సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం ఆత్రేయపురం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ కొండా అన్నపూర్ణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా గ్రామాల్లోని సమస్యలపై సభ్యులు ధ్వజమెత్తారు. మెర్లపాలెం గ్రామంలో జల జీవన్ మిషన్ పనులు ముందుకు సాగకపోవడంతో తాగునీటి ఎద్దడి నెలకొందని గ్రామ సర్పంచ్ మెర్ల శ్రీరామచంద్రమూర్తి అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయంపై ఆర్డబ్ల్యూఎస్ జేఈ శ్రీధర్ మాట్లాడుతూ సంక్రాంతి నాటికి పనులు పూర్తి చేస్తామని చెప్పారు. నల్ల లాకులపై భారీ వాహనాలు వెళుతున్న ఎవరూ పట్టించుకోవడంలేదని నార్కెడిమిల్లి సర్పంచ్ పాల నాగేశ్వరరావు తదితరులు ఆరోపించారు. పూర్తిగా శిథిలమయినందున ఎప్పుడు కూలుతుందో అర్థం కాని పరిస్థితిలో ఉందన్నారు. దీనిపై సంబంధిత ఏఈ మాధవ ప్రసన్న మాట్లాడుతూ కొత్త లాకుల నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి నివేదించామన్నారు. అలాగే భారీ వాహనాలు వెళ్ళకుండా లస్కర్లను నియమిస్తామని చెప్పారు. గ్రామాల్లో లో వోల్టేజ్ నివారణకు త్రీఫేస్ కరెంట్ ఇచ్చేందుకు పనులు చేపట్టి ఏడాది అవుతున్న పనులు పూర్తి కాలేదని పేరవరం సర్పంచ్ గంటి విజయభారతి, నార్కెట్ మిల్ సర్పంచ్ బాల నాగేశ్వరరావు తదితరులు ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై సంబంధిత ఏఈ అశోక్ మాట్లాడుతూ కొత్తగా విధుల్లోకి చేరడం జరిగిందని, ఆయా సమస్యలు పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని చెప్పడంతో శాంతించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకట్రామన్ ఆర్ అండ్ బి ఏఈ మణికుమార్, ఆర్ఐ భాను, ఈఓపిఆర్డీ చంద్రశేఖర్, సూపర్నెంట్ రామ స్వరూప్, సిడిపిఓ శారద, వైద్యాధికారి ఐమశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** గ్రామాల్లో నెలకొని ఉన్న భూసమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు అని తాసిల్దార్ టి.రాజేశ్వరరావు, ప్రత్యేక అధికారి రామారావు, రిజిస్ట్రార్ రత్న కుమార్ అన్నారు. మంగళవారం వాడపల్లిలో జరిగిన రెవెన్యూ సదస్సు ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడారు అనంతరం అర్జీలు స్వీకరించి ఆన్లైన్లో నమోదు చేశారు.

ఫిర్యాదు స్వీకరణలో భాగంగా వాడపల్లి దేవస్థానం డిప్యూటీ కమిషనర్ నల్లం చక్రధర్ రావు ఇచ్చిన ఫిర్యా దుపై పార్కింగ్ స్థలం పరిశీలించారు. ఆక్రమణలకు గురి అయిం దని గమనించారు. ఈ కార్యక్రమంలో లోల్ల సర్పంచ్ కాయల జగ న్నాథం, వాడపల్లి ఉపసర్పంచ్ బాబురావు, ఆర్ఐ బాను, ఆలయ సూపర్నెంట శ్రీనివాస్, వీఆర్వోశ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## సరివేల గ్రామం వద్ద కారును దగ్ధం చేసిన మావోయిస్టులు




**చింతూరు, మేజర్ న్యూస్ :** చింతూరు మండలంలోని సరివేల గ్రామ సమీపంలో మంగళవారం తెల్లవారు జామున మావోయిస్టులు ఒక కారును దగ్ధం చేసారు. వివరాలలోకి వెళితే తెలంగాణ రాష్ట్రం లోని ఏటూరునాగారం పోలీస్ స్టేషన్ పరిధిలో గల చలపాక గ్రామ సమీపంలోని అడవుల్లో ఏడుగురు మావోయిస్టులను గ్రేహౌండ్స్ పోలీస్‌లు ఇటీవల ఎన్‌కౌంటర్ గావించారు. ఈ ఎన్‌కౌంటర్ బూటకమని మావోయిస్టులు సోమవారం బంద్‌కు పిలుపునిచ్చారు. దీంతో చింతూరు పోలీస్ సర్కిల్ లోని అన్ని పోలీస్ స్టేషన్లను అప్రమత్తం చేశారు. చింతూరు మండలం ఏడుగురాళ్ల పల్లి మీదుగా వెళ్ళవల్సిన వాహనాలను కూనవరం మీదుగా మళ్ళించారు. మంగళవారం రాజమండ్రి నుండి భద్రాచలం వెళుతున్న ఒక కారు ఈ విషయం తెలియక ఏడుగు రాళ్ళ పల్లి మీదుగా భద్రాచలం వెళుతుండగా సరివేల గ్రామం దాటిన తర్వాత దారికాసిన మావోయిస్టులు ప్రయాణికులను దించి కారుపై కర్రలు వేసి దగ్ధం చేసారు. ఈ విషయం తెలుసుకున్న చింతూరు పోలీస్‌లు మంగళవారం ఉదయం సంఘటనా స్థలాన్ని సందర్శించారు. కేసు నమోదు చేసుకుని, కారు, ఎవరిది, ఎక్కడినుండి వస్తుంది అనే విషయాలపై దర్యాప్తు సాగిస్తున్నారు.

## ఆదిత్య డిగ్రీ కళాశాలలో ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం

### – స్వేచ్ఛ, శాంతి ,సమానత్వం, దేశ అభివృద్ధి ఫలాలు అందరికీ సమానంగా అందాలి

### – డాక్టర్ నాని బాబు అసిస్టెంట్ ప్రొఫెసర్




**కాకినాడ, మేజర్ న్యూస్ :** స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం, డాక్టర్ మానికిరెడ్డి హెల్త్ కేర్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించినట్లు ఆదిత్య డిగ్రీ మరియు పీ జీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఈవిఎల్ నాయుడు తెలియజేశారు.స్వేచ్ఛ సమానత్వాలు, హక్కులను కాపాడుకునేందుకు నిర్వహించే అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం ఆదిత్య డిగ్రీ కళాశాలలో జరిగింది. భారత రాజ్యాంగ రూపకర్త, భారతరత్న డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ నాయుడు మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి 1948 డిసెంబర్ 10వ తేదీన ప్రపంచ ప్రజలందరికీ స్వేచ్ఛ, సమానత్వం, న్యాయం అందాలని విశ్వవ్యాప్త మానవ హక్కుల ప్రకటనను చేసిందని అన్నారు. భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కుల గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెస్ ఎన్ చారిటీస్ పీజీ క్యాంపస్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం నాని బాబు మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి అంశం పైన అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. మనిషి మనుగడకు, స్వేచ్ఛకు భంగం కలుగుతున్న సమయంలో మానవ హక్కులు ఉపయోగపడతాయని తెలిపారు.

ఈ సందర్భంగా హక్కుల పరిరక్షణకు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ నిర్విరామ కృషిని వివరించారు. మానవ హక్కుల ఉల్లంఘన జరిగినప్పుడు సుప్రీంకోర్టును ఆశ్రయించిన సంఘటనలు వివరించారు. అనంతరం విద్యార్థులు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. గౌరవ అతిధిగా విచ్చేసిన మానికిరెడ్డి హెల్త్ కేర్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ మానికిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు తమ హక్కులను తాము తెలుసుకొని బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని, యువశక్తి దేశానికి వెన్నెముక అనిఅన్నారు. అనంతరం ముఖ్య అతిధిని దుశ్శాలువతో సత్కరించారు.ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఎన్ ఎస్ ఎస్ బృందాన్ని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణా రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ఇన్చార్జి మూర్తి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు తేజేశ్వరరావు, గౌరీ ప్రియ,అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మానవహక్కుల, లింగ సమానత్వ దినోత్సవం




**చింతూరు,మేజర్‌న్యూస్ :** స్థానిక చింతూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ప్రపంచ మానవహక్కుల, మరియు లింగ సమానత్వ దినోత్సవం ఉమెన్ ఎంపవర్మెంట్ కో–ఆర్డినేటర్ కె.శైలజ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రత్న మాణిక్యం, స్థానిక అడ్వకేట్ యం.రవితేజ హాజరైనారు. ప్రిన్సిపాల్ .కె.రత్న మాణిక్యం విద్యార్థినీ, విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో తల్లిదండ్రులు తమ పిల్లలను తారతమ్యంతో చూస్తున్నారని, ఆడపిల్ల, మగపిల్లవాడు, ఇటువంటి వివక్షత తల్లిదండ్రుల విడనాడాలని తెలిపారు. అడ్వకేట్ యం.రవితేజ మాట్లాడుతూ ఆడపిల్లలపై అత్యాచారాలు జరిపితే సెక్సువల్ హెరాస్మెంట్ 2005 డెమోస్టిక్ ఇన్సిడెంట్ రిపోర్ట్ (డి.ఆర్.ఐ) సెక్షన్ 18(1) ప్రకారం కేసు నమోదు చెయ్యవచ్చునని తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ ముల్లు శేఖర్ మాట్లాడుతూ ప్రజల హక్కులకు భంగం కలిగితే వెంటనే మానవ హక్కుల సంఘం అనేది ఉన్నదని వారిని సంప్రదించాలని తెలిపారు. రాజనీతిశాస్త్ర విభాగధిపతి యస్.అప్పనమ్మ మాట్లాడుతూ భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 12 నుండి 35 వరుకు మహిళలకు హక్కులు ఇవ్వడం జరిగిందని అన్నారు. మహిళలకు, బాలికలకు ఆర్టికల్ 12(ఎ) ప్రకారం నిర్భంధ ఉచిత విద్య అందించేందుకు చర్యలు తీసుకుంటారని తెలిపారు. జాతీయ సేవా విభాగం (యన్.యస్.యస్) ప్రోగ్రాం ఆఫీసర్ జి.సాయికుమార్ మాట్లాడుతూ మహిళలకు పురుషులకు సమాన అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. ఉమెన్ ఎంపవర్‌మెంట్ కో–ఆర్డినేటర్ కె.శైలజ అధ్వర్యంలో విద్యార్థినీవిద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు జి.వెంకటరావు, ఆర్.సిహెచ్.నాగేశ్వరావు, కె.శ్రీదేవి, జి.హారతి,అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు.

## హైస్కూల్లో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని మంత్రికి వినతి



రామచంద్రపురం, మేజర్‌న్యూస్ : రామచంద్రపురం నియోజకవర్గం కె.గంగవరం మండలం కోటిపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో విద్యార్థులు తాగడానికి మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని ఆ పాఠశాల పూర్వ విద్యార్థి, సామాజికవేత్త కొండేపూడి బుల్లిరాజు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు వినతి పత్రం అందజేశారు. అదేవిధంగా విద్యార్థులు సైకిల్స్ పెట్టుకునేందుకు సైకిల్ షెడ్డు ఏర్పాటు చేయాలని మంత్రి సుభాష్‌ని బుల్లి రాజు కోరారు. విద్యార్థులు అవసరం అయ్యే మినరల్ వాటర్ ప్లాంట్, సైకిల్స్ పెట్టుకునేందుకు షెడ్డు నిర్మాణానికి కృషి చేస్తానని మంత్రి సుభాష్ హామీ ఇచ్చారని బుల్లిరాజు తెలిపారు.

## ఆదివాసి సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు






**చింతూరు, మేజర్ న్యూస్ :** అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం డివిజన్లోని చింతూరు మండలం పరిధిలో ఆదివాసి సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో ఐటీడీఏ ముందు రిలే నిరాహార దీక్షలను పూనం చిన్న వీరభద్రం, పులి వీరయ్య ప్రారంభించారు. ఈ దీక్షలు ఉద్దేశించి ఆ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూనం చిన్న వీరభద్రం మాట్లాడుతూ భారత రాజ్యాంగంలోని ఐదో షెడ్యూల్ ప్రాంతంలో ఆర్టికల్ 24 (1) పేరా 5(1)లో మార్పులు చేర్పులు చేసి షెడ్యూలు ప్రాంతాలలోని ఉపాధ్యాయ, ఫారెస్ట్ డిపార్ట్మెంట్, పోలీస్ డిపార్ట్మెంట్, మెడికల్ డిపార్ట్మెంట్, రెవిన్యూ డిపార్ట్మెంట్ మరియు ఇతర శాఖలో ఉద్యోగాలను స్థానిక ఆదివాసి యువతి, యువకులతో భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో ఉన్న ఆదివాసి ఎమ్మెల్యేలు తమ ప్రాంతంలో ఉన్న ఆదివాసి యువతీ యువకుల కోసం ఉద్యోగ భద్రత చట్టాన్ని తీసుకురావడం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. గురుకుల పాఠశాల పనిచేస్తున్న ఉద్యోగస్తులకు కనీస వేతనం 25 నుంచి 30 వేల వరకు పెంచాలని డిమాండ్ చేశారు.

పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు భూ నిర్వాసిత చట్టం 2013 ప్రకారం భూమికి భూమి, విద్యా వైద్యం తదితర సదుపాయాలతోపాటు స్కిల్ డెవలప్మెంట్ కేంద్రాలను ఏర్పాటుచేసి వారికి ఉపాధిని కల్పించాలని చదువుకున్న వారికి పోలవరం విద్యుత్ ప్రాజెక్ట్‌లో ఉద్యోగాలు కల్పించాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పులి వీరయ్య, రవ్వ ప్రసాదు, సోడే రఘువయ్య, కుంజ శ్రీను, పోడియం లక్ష్మణరావు, సోడి ప్రసాద్, దూబి లక్ష్మయ్య, సవలం కోటి, సోడి రాజు, కోలా శేషు, పాయం మహేష్, సవలం రాము, మహిళా నాయకురాలు, కారం శంకరమ్మ,సోడి సత్యవతి, ఇరకం నాగమణి, సోడి బాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక, మట్టి, లిక్కర్ ఇవి కూటమి ప్రభుత్వానికి మూడు పువ్వులు ఆరు కాయలుగా ఉన్నాయి

### – మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి




**రావులపాలెం,మేజర్‌న్యూస్ :** వైఎస్ఆర్సీపీ కార్యాలయం వద్ద జరిగిన మీడియా సమావేశంలో మాజీ శాసనసభ్యులు చిర్ల జగ్గిరెడ్డి మాట్లాడుతూ ఇసుక, మట్టి, లిక్కర్ ఇవి కూటమికి మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతున్నాయని అన్నారు. అలాగే ఫ్రీ ఇసుక విషయంలో చంద్రబాబు నాయుడు చెప్పేవి అన్ని అబద్ధాలు అని, ఆయన చెప్పేది ఒకటి ఇక్కడ జరిగేది ఒకటి అన్నారు. కొత్తపేట నియోజకవర్గం నుండి ఒక లారీ ఇసుక అమలాపురం వెళ్లాలంటే 25 వేల రూపాయలు అవుతుందని ఇదేనా మీరు ఇచ్చే ఫ్రీ ఇసుక కానీ ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం రైతులను గాలికి వదిలేసింది అన్నారు. ఈ రాష్ట్రంలోని రైతులకు అండగా నిలిచేందుకు, ధాన్యం కొనుగోళ్ళలో ప్రభుత్వంపై వత్తిడి తెచ్చి, రైతులకు న్యాయం చేసేందుకు ఈ నెల 13న రాష్ట్రవ్యాప్త కార్యక్రమాలకు వైయస్ఆర్ కాంగ్రెస్ అధినేత వైయస్ జగన్ పిలుపునిచ్చారు అని అన్నారు.రాష్ట్రంలో రైతుల పరిస్థితి అతి దారుణంగా ఉందనీ, ఈఏడాది అకాల వర్షాలు, వాయుగుండాల వల్ల రైతుల పంట దిగుబడి ఇరవై నుంచి ముప్పై బస్తాలకే పరిమితం అయ్యింది అన్నారు. చివరికి ఆ ధాన్యంకు కూడా గిట్టుబాటు ధర కల్పించలేని దుర్మార్గమైన పరిస్థితిని ఈ రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది అని అన్నారు. పౌరసరఫరాలశాఖ మంత్రి మనోహర్ రైతుల వద్దకు వెళ్ళి ఇచ్చిన హామీలు నిజమని నమ్మిన రైతులు ఎన్నిసార్లు ఫోన్ చేసినా, మెసేజ్ చేసినా పట్టించుకున్న వారే లేరు అని అన్నారు. వైయస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు మద్దతు ధర కన్నా ఎక్కువకే రైతులు ధాన్యం అమ్ముకున్నారు అని జ్ఞాపకం చేశారు. నేడు ఇన్ పుట్ సబ్సిడీ లేదు, ఈ క్రాప్ అసలే లేదు. ఈ పరిస్థితిలో రైతుకు అండగా వైయస్ఆర్ సిపి ఉందనే నమ్మకం ప్రజలకు వుందని, ఎన్డీయే కూటమి ప్రభుత్వం రైతు వ్యతిరేక ప్రభుత్వం అని, ఈ పరిస్థితులకు నిరసనగా అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాలవద్దకు వెళ్ళి వినతిపత్రాలు సమర్పించబోతున్నాం అని, ప్రతిఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలోసర్పంచ్‌లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు మరియు వైసీపీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

సూర్య
తూర్పుగోదావరి
బుధవారం, 11 డిసెంబర్ 2024


## ఫిబ్రవరి 28 నాటికి లైఫ్ సర్టిఫికెట్లు అందజేయాలి - ఎటిఓ కాళికృష్ణ



**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులు 2025 ఫిబ్రవరి 28 తేదిలోగా లైఫ్ సర్టిఫికెట్లు అందజేయాలని పెద్దాపురం సబ్ ట్రెజరీ అధికారి ఎ.కాళికృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్షనర్లు స్మార్ట్ ఫోన్‌లో గాని, మీసేవ కేంద్రంలో గాని, నేరుగా సబ్ ట్రెజరీ కార్యాలయంలో గాని తమ వేలిముద్ర ద్వారా లైఫ్ సర్టిఫికెట్లు అందజేయాలన్నారు. లైఫ్ సర్టిఫికెట్లు అందజేయని వారి ఫించను మార్చి నుంచి ప్రభుత్వం నిలిపి వేస్తుందని ఆయన తెలిపారు.

## 16న ఉపాధి హామీ సామాజిక తనిఖీ బహిరంగ సభ



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** ఈ నెల 16వ తేదిన ఎంజిఎన్ఆర్ఇజిఎస్ సామాజిక తనిఖీ బహిరంగ సభ పెద్దాపురం మండల పరిషత్ కార్యాలయం వద్ద ఉదయం 10గంటల నుండి నిర్వహించబడునని, ఎంజిఎన్ఆర్ఇజిఎస్ జెఇ వి.సతీష్ కుమార్, ఇన్‌చార్జి ఎపిఓ సుధీర్‌లు తెలిపారు. ఈ సందర్భంగా వారు తెలుపుతూ ఈ బహిరంగ సభ ఎంపిడిఓ డి.శ్రీలలిత అధ్యక్షతన నిర్వహించబడునని

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా స్థానిక శాసనసభ్యులు, ప్రజాప్రతినిధులు, ఎంజిఎన్ఆర్ఇజిఎస్ పిడి అడపా వెంకటలక్ష్మీ పాల్గొననున్నారని వారు తెలిపారు.

# రెవెన్యూ, భూ సమస్యల పరిష్కారానికి చక్కటి వేదిక రెవెన్యూ సదస్సులు

### – జిల్లా కలెక్టర్ షణ్మోహన్

**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** రెవెన్యూ, భూ సమస్యల పరిష్కారానికి చక్కటి వేదిక రెవెన్యూ సదస్సులని జిల్లా వ్యాప్తంగా నేటి నుండి ప్రారంభమైన రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులకు సంబంధించి మంగళవారం కాకినాడ జిల్లా,పెద్దాపురం నియోజకవర్గంలో పెద్దాపురం మండలం, గోరింట గ్రామంలో పెదరామాలయం వద్ద ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సుకు ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకినాడ జిల్లాలో నేటి నుంచి రెవెన్యూ సదస్సులు ప్రారంభించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల6 నుండి ప్రారంభమైన కాకినాడ జిల్లాలో ఎమ్మెల్సీ కోడ్ అమలులో ఉన్నందున నాలుగు రోజులు ఆలస్యంగా ప్రారంభించడం జరిగిందని ఆయన తెలిపారు. కాకినాడ జిల్లాలో ఈ నెల 10 నుండి జనవరి 8, 2025



వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించేందుకు తగిన ప్రణాళికలు సిద్ధం చేయడం జరిగిందన్నారు. గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించేందుకు రెవెన్యూ సదస్సులు కీలక పాత్ర పోషిస్తాయని ఆయన తెలిపారు. ప్రతీవారం నిర్వహిస్తున్న ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమంలో నూటికి 50 శాతం అర్జీలు భూ వివాదాలు, రెవెన్యూ అంశాలకు సంబంధించిన దరఖాస్తులు ఉంటున్నాయన్నారు. వీటన్నిటిని దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన భూ సమస్యలు పరిష్కరించే లక్ష్యంతో ప్రతీ గ్రామంలోను ఈ రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందన్నారు. రెవెన్యూ, భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు నిలుస్తాయని, రెవెన్యూ రీ సర్వే విషయాలకు సంబందించిన సమస్యలు మాత్రమే చర్చించి పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు.

ఆయా గ్రామాలలో జరుగుతున్న రెవెన్యూ సదస్సులను ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం ఆర్డీఓ కె.శ్రీరమణి, గ్రామ పంచాయతీ సర్పంచ్ పచ్చిపాల నేరీకుమారి, ఎంపిటిసి పచ్చిపాల సతీష్, మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజా సూరిబాబురాజు, తహశీల్దార్ సిహెచ్.వెంకటలక్ష్మీ, గ్రామ నాయకులు పచ్చిపాల సత్తిబాబు, పచ్చిపాల దొరబాబు, బర్రె నూకరాజు, గ్రూప్ టెంపుల్ ఇఓ సాయిప్రసాద్, డిటి కాంతారావు, ఆర్ఐ రమణ, విఆర్ఓలు, తదితరులు పాల్గొన్నారు.

## పీహెచ్‌సి నెల్లిపాక విజిట్ చేసిన జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ అధికారి



**ఎటపాక, మేజర్ న్యూస్ :** జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సి.జమాల్ బాషా చింతూరు డివిజన్ సందర్శనలో భాగంగా డిప్యూటీ డిఎం మరియు హెచ్‌ఓ డాక్టర్ పుల్లయ్య అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం నెల్లిపాక ప్రభుత్వ వైద్యశాలను మంగళవారం తనిఖీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా పిహెచ్‌సిలో అందుతున్న సేవలు, వసతులు, ఏర్పాట్లు పరిశీలిం చడం జరిగింది. పీహెచ్‌సిలో అందుతున్న సేవలను పరిశీలించి, వైద్యసేవలు మెరుగుపరుచుకోవలసిన సూచనలు తెలియజేశారు. ఏమర్జెన్సీ మందులు, సీజనల్ మందులు, ఎపిడమిక్ మందుల నిల్వలు,అవసరాలు ఎలా ఉన్నది పరిశీలించారు. వైద్య పరీక్షలు, అవసరాలు పరిశీలించారు. వాక్సిన్ల నిలువలు, కోల్డ్ చైన్ మెయిన్‌టెనెన్స్ పరిశీలించారు. వార్డ్‌లో రోగులతో ఇంటరాక్ట్ అయ్యి అందుతున్న సేవలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యశాల వైద్యాధికారి డాక్టర్ ప్రత్యూష్, సూపర్‌వైజర్ గుజ్జా సీతమ్మ, వైద్య సిబ్బంది, స్థానిక పారామెడికల్ సిబంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## 61 మంది గర్భిణీ స్త్రీలకు పీఎం ఎస్ఏవై పరీక్షలు



**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** మండలంలోని రాజవొమ్మంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద మంగళవారం గర్భిణీ స్త్రీలకు వైద్య పరీక్షలు నిర్వహించారు.వైద్యాధికారి సుష్మ ఆధ్వర్యంలో 61 మంది గర్భిణీ స్త్రీలకు ప్రధాన మంత్రి మాతృత్వ సురక్ష ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు అందజేశారు. హిమోగ్లోబిన్ , హైపర్ టెన్షన్, స్కానింగ్ పరీక్షలు చేసి గర్భిణీ స్త్రీలకు ఆరోగ్య సూచనలు చేశారు. ఆకుకూరలు విటమిన్లతో కూడిన ఆహార పదార్థాలు తీసుకోవాలని, వైద్యుల సలహాలు పాటించాలని డాక్టర్ సుష్మ తెలిపారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పద్మావతి, హెచ్ వి రమాబాయి , లక్ష్మమ్మ,, ఏఎన్ఎం లు, ఎం ఎల్ హెచ్ పీలు, ఆశ వర్కర్లు,అంగన్వాడీ వర్కర్లు ఉన్నారు.

## సిఆర్టీల సమస్యలు పరిష్కరించాలని వినతి

**రంపచోడవరం,మేజర్‌న్యూస్ :** గిరిజన ప్రాంతంలో సీఆర్టీ ఉపాధ్యాయుల డిప్యూటేషన్లు వెంటనే ఉపసంహరించుకోవాలని గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు మంగళవారం డిమాండ్ చేశారు. సమస్యలకు పరిష్కారం చూపలేని ప్రభుత్వం డిప్యూటేషన్లు వేయడం సరికాదన్నారు. సిఆర్టీ ల న్యాయమైన సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. డిప్యూటేషన్లు ఉపసంహరించుకోకుంటే విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. రాష్ట్రంలో గురుకులాల్లో పని చేస్తున్న టీచర్స్ అధ్యాపకులు వారి డిమాండ్లు పరిష్కరించాలని 24 రోజులుగా సమ్మె చేస్తుంటే వారి న్యాయమైన డిమాండ్లు పరిష్కరించకపోగా వారందరినీ భయభ్రాంతులకు గురిచేయడం తగదన్నారు. తమ సర్వీసులను గుర్తించి రెగ్యులర్ చేయాలని, సిఆర్టీలుగా గుర్తించాలని కోరుతున్నారని, త్వరలో ప్రకటించనున్న మెగా డీఎస్సీలో తమ పోస్టులు కలవద్దని కోరుతున్నారు, ఇటువంటి న్యాయమైన సమస్యలను వారిని టెర్మినల్ చేస్తామని భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, ఈ సమ్మెలో సుమారు 1400 మంది రాష్ట్ర వ్యాప్తంగా రోడ్లపై నిరసన తెలుపుతుంటే మరోపక్క విద్యార్థుల భవితవ్యం ప్రశ్నార్ధకంగా మారుతుంటే ప్రభుత్వం మాత్రం పట్టీపట్టినట్టు వ్యవహరిస్తుందని, ఈరోజుల్లో ఈ పోటీ ప్రపంచంలో ఒక క్లాసు నష్టపోతే ఎంతో నష్టం విద్యార్థులకు జరుగుతుంటే 24 రోజులుగా చదువులు లేకుండా ఈరోజు పిల్లలు ఖాళీగా ఉంటే ఏ విధంగా ఈ ప్రభుత్వం చూస్తూ ఊరుకుంటుందని ప్రశ్నించారు. ఈరోజు డిప్యూటేషన్ పేరుతో ఏజెన్సీలో ఉన్నటువంటి గిరిజన ఉపాధ్యాయులు సిఆర్టి లను మైదాన ప్రాంతాలకు పంపిస్తున్నారని, ఈరోజు రిలీవ్ అయినవారికి కేటాయించిన పాఠశాలల్లో రేపు 11 గంటలలోపు విధుల్లో చేరాలని వారిని భయపడుతున్నారని, ఆ జిల్లాలోని మున్సిపల్ పాఠశాలలో జడ్పీ పాఠశాలలో సమీపంలో ఉన్న ఉపాధ్యాయులను కొరత ఉన్న ప్రాంతాలలో వేయచ్చు కదా అని ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే ఈ డిప్యూటీషన్ విధానాన్ని ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో విద్యార్థుల తల్లిదండ్రులతో నిరసనలు భారీ స్థాయిలో చేస్తామని గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు రాతా రామారావు అన్నారు.

## దేశ భవిష్యత్తుకు పునాదులు విద్యార్థులే..

### – సిఐ శ్రీ సూర్య అప్పారావు





**రౌతులపూడి, మేజర్ న్యూస్ :** దేశ భవిష్యత్తుకు పునాదులు విద్యార్థిలేనని క్రమశిక్షణతో కూడిన విద్య అవసరమని ప్రత్తిపాడు సిఐ శ్రీ సూర్య అప్పారావు అన్నారు.కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం రౌతులపూడి మండలం, ఏ.మల్లవరం ఏపి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది మరియు విద్యార్థులకు అవగాహన నిర్వహించారు విద్యార్దులు మత్తు పదార్థాలకు చెడు వ్యసనాలకు బానిసలు అవుతున్నారని పత్రికలో వచ్చిన వార్త కథనాలుపై కాకినాడ జిల్లా ఎస్పి శ్రీ విక్రాంత పాటేల్ ఐపి ఎస్ మరియు పెద్దాపురం డీఎస్పీ శ్రీ శ్రీహరి ఆదేశాల మేరకు మంగళవారం పాఠశాలలో విచారణ చేపట్టారు.ప్రతిపాడు సీఐ శ్రీ సూర్యఅప్పారావు, రౌతులపూడి ఎస్ ఐ వెంకటేశ్వర్లు ఎంఇఓ గాడి కొండబాబు కలిసి ఏ మల్లవరం సాంఘిక సంక్షేమ మరియు గురుకుల పాఠశాలను సందర్శించి తనిఖీ చేసారు.సిబ్బంది,టీచింగ్ అండ్ నాన్ టీచింగ్ స్టాఫ్, స్వీపర్ లను మరియు వాచ్మెన్ లను ఎంక్వైరీ చేయడం జరిగిందన్నారు,అలాగే హాస్టల్ గదులని అకస్మాత్తుగా పరిసరాలను తనిఖీ చేయడం జరిగింది.వార్తలో వచ్చిన విషయాలు ఏమి ఎంక్వైరీలో కాన రాలేదన్నారు.ఈ విషయంపై పూర్తి స్థాయి విచారణ జరిపి అటువంటి విషయాలు ఎమైన వెలుగులోకి వస్తే చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని సీఐ తెలియజేసారు.తదుపరి సీఐ పిల్లలతో మాట్లాడి,సైబర్ క్రైమ్, డ్రగ్స్ మరియు గంజాయి వంటి మత్తు పదార్థాల మీద అవగాహన కల్పించడం జరిగిందని ఎస్ఐ తెలిపారు.

## అధ్వానంగా 'రంప' రహదారి !

### – అసంపూర్తిగా నిర్మాణ పనులు





**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** రంపచోడవరం – రంప రహదారి నిర్మాణ పనులు పూర్తి కాకపోవడంతో రోడ్ అధ్వానంగా మారి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే శీతంశెట్టి వెంకటేశ్వరరావు విలేకరులకు తెలిపారు. రంపచోడవరం నియోజకవర్గం పరిధిలోని రంపచోడవరం నుండి రంప గ్రామం వరకు రహదారి గోతులు మయంగా మారిందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పలు రహదారుల్లో గోతులు పూడ్చడానికి చర్యలు తీసుకుంటోందని ఆయన పేర్కొన్నారు. ఇందులో భాగంగా రంపచోడవరం నుండి రంప వరకు మిషనుతో రహదారి తవ్వారని, అయితే ఈ పనులు ప్రారంభించి చాలా రోజులు కావస్తున్నా రంప రహదారిపై తారు వేసే పని ఇప్పటివరకు మొదలు పెట్టలేదన్నారు. ప్రభుత్వం ఈ పనికి నిధులు మంజూరు చేయలేదా, లేక ఇంజనీరింగ్ అధికారులకు, కాంట్రాక్టర్లుకు ఒప్పందం కుదరలేదా! అని ఆయన ప్రశ్నించారు. ఇంకా ఏవైనా కారణాలు ఉన్నాయో అర్థం కావడం లేదన్నారు. ఈ రహదారిలో రాకపోకలు సాగించే ప్రయాణికులు, వాహనదారులు, కాలినడకన వెళ్లేవారు దుమ్ము ధూళితో బాధపడుతున్నారని మాజీ ఎమ్మెల్యే శీతంశెట్టి వెంకటేశ్వరరావు వివరించారు. రహదారి నిర్మాణం పూర్తి చేయకకోవడంతో ప్రజలు కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా మధ్యలో ఆగిపోయిన రంప రహదారి పనులు వెంటనే మొదలు పెట్టి, విమర్శలకు తావు ఇవ్వ కుండా పనిచేయుటకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రంప చారిత్రాత్మక ప్రాంతంలో ఉన్న పర్యాటక ప్రదేశాలకు, పురాతన శివాలయం, జలపాతం వద్దకు నిత్యం ఎంతోమంది పర్యాటకులు, భక్తులు రాకపోకలు సాగిస్తున్నారని, కాబట్టి ఈ రహదారి నిర్మాణం వెంటనే పూర్తి చేయాలని ఆయన కోరారు.

## సహజ వనరులను దోచేస్తున్న అదానీను వెంటనే అరెస్ట్ చేయాలి

### – కాకినాడలో సీపీఐ నిరసన – ఆదాని గ్రూప్ కంపెనీల అవినీతిపై సమగ్ర విచారణ జరపాలి

### – సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధు




**కాకినాడ, మేజర్‌న్యూస్ :** ఆదాని గ్రూప్ కంపెనీల అవినీతిపై సంయుక్త పార్లమెంటరీ సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకొని వెంటనే అరెస్ట్ చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధు డిమాండ్ చేశారు. మంగళవారము ఉదయం స్థానిక భానుగుడికూడలిలో నిరసన కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. అంతకముందు మదర్ థెరిస్సా సెంటర్ నుండి ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమాన్ని ఉద్దేశించి మధు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలపై ఆదాని గ్రూపు కంపెనీల అవినీతి తప్పిదాల అశ్రిత పక్షపాత ధోరణిని ప్రోత్సహించడంలో కేంద్ర ప్రభుత్వ పాత్రపై దర్యాప్తు చేయాలని, అందుకోసం సంయుక్త పార్లమెంటరీ కమిటీ ఏర్పాటు చేయాలని, మణిపూర్‌లో హింసాత్మక పరిస్థితులపై పార్లమెంటులో చర్చించాలని, సాయుధ బలగాల ప్రత్యేక రక్షణ చట్టం ఉపసంహరించుకోవాలన్నారు. అధిక ధరలు అరికట్టాలని, నిరుద్యోగాన్ని నిర్మూలించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. అమెరికాలోని న్యూయార్క్ ఈస్టన్ డిస్టిక్ కోర్టులో అదానిపై అవినీతి కేసు నమోదు అయిందన్నారు. విద్యుత్ ఒప్పందాల కోసం అదానీ నాలుగు రాష్ట్రాలలో దాదాపు రూ.2100 కోట్ల ముడుపులు ఇచ్చినట్టు ఆరోపణలున్నాయన్నారు. అత్యధిక భాగం రూ.1750కోట్ల ఆంధ్రప్రదేశ్ గత ప్రభుత్వం హయాంలో ముడుపులుగా ముట్ట చెప్పినట్లు తెలుస్తుందని అన్నారు. దీని ఫలితంగా 25 సంవత్సరాల పాటు రాష్ట్ర ప్రజలపై రూ.1,10కోట్ల మేర విద్యుత్ చార్జీల భారం పడుతుందని తెలిపారు.

ఈ అంశంపై భవిష్యత్‌లో మరిన్ని ఉద్యమాలు చేస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కె.బోడకొండ, సహాయ కార్యదర్శి ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి తోకల ప్రసాద్, పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు పి.సత్యనారాయణ, ఏఐవైఎఫ్ నాయకులు సూరిబాబు వెంకట్, మహిళా సమాఖ్య నాయకురాలు కుమారి తదితర మహిళాలు పాల్గొన్నారు.

## శెట్టిబలిజ 'మహా దన్ను' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి



**కాకినాడ, మేజర్‌న్యూస్ :** శెట్టిబలిజ జాతిని జాగృతి చేసి సామాజిక అభ్యున్నతికి అహర్నిశలు కృషిచేసిన పితామహుడు దివంగత దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహ ఆవిష్కరణ, శెట్టిబలిజ మహా దన్ను ఈనెల 15వ తేదీన రాజమండ్రిలో జరిగే సభను విజయవంతం చేయాలని శెట్టిబలిజ కార్పొరేషన్ ఛైర్మన్ కుడుపూడి సత్తిబాబు విజ్ఞప్తి చేశారు. స్థానిక సుబ్బయ్య హోటల్ శెట్టిబలిజ కళ్యాణమండపం నందు సోమవారం సాయంత్రం ఆయన కాకినాడలో మీడియాతో మాట్లాడుతూ ఎన్నో ప్రభుత్వాలు వచ్చాయి కానీ గీత కులాలను గౌరవించి ఆర్థికంగా వెనకబడిన గీత కులాలను గుర్తించి రిజర్వేషన్ కల్పించిన ప్రభుత్వం ఏదైనా ఉంది అంటే అది చంద్రబాబు నాయుడు ప్రభుత్వం అని గర్వంగా చెప్పుకుంటున్నామని అంతేకాక బీసీలకు కూడా సర్పంచులైన ఎంపీటీసీలైన స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ కల్పించిన నందమూరి తారక రామారావు స్థాపించిన ఈ పార్టీని ఆర్థికంగా బలోపేతం చేసుకుంటామని తెలియజేశారు. అంతేకాక మద్యం షాపులలో శెట్టిబలిజ కులస్తులకు 10 శాతం రాయితీ కల్పించిన చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపేందుకు ఈ మహాదన్ను కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అదేవిధంగా శెట్టిబలిజ ప్రముఖులు దివంగత దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం జరుగుతుందని ఛైర్మన్ సత్తిబాబు తెలిపారు. అనంతరం శెట్టిబలిజ కార్పొరేషన్ ఛైర్మన్ ను మరియు డైరెక్టర్లులను సన్మానించారు. ఈ మహాసభను విజయవంతం చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా శెట్టిబలిజ కులస్తులు హాజరుకావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శెట్టిబలిజ సంఘ రాష్ట్ర అధ్యక్షులు చొల్లంగి వేణుగోపాల్, నులుకుర్తి వెంకటేశ్వరరావు, చొల్లంగి వీరబాబు, రెడ్డి రాంపల్లంరాజు, సివిల్ సప్లై డైరెక్టర్ కడలి ఈశ్వరి, శెట్టిబలిజ కొర్పోరేషన్ డైరెక్టర్లు వమ్మి బాలాజీ, చప్పిడి వెంకటేశ్వరరావు, పెంకే వెంకటేష్, పెంకె జగదీష్ తో పాటు గుత్తుల శ్రీనివాస్, వాసంశెట్టి రాజేశ్వరరావు నెహ్రూ, కాకరపల్లి చలపతి, మేడిశెట్టి చిన్ని, కుడుపూడి వెంకటలక్ష్మి, తుట్టా లీలావతి, తదితరులు పాల్గొన్నారు.

## పి.గన్నవరంలో కారు ప్రమాదం

### – ముగ్గురు గల్లంతు..ఒకరు క్షేమం



**పి.గన్నవరం, మేజర్ న్యూస్ :** ఊడిమూడి గ్రామం చింతవారిపేట సమీపంలో మంగళవారం తెల్లవారుజామున మూడు గంటల సమయంలో కారు ప్రధాన పంట కాలువ లో దూసుకెళ్లింది, భార్య ఉమ, పెద్ద కుమారుడు మనోజ్(9)రెండవ కుమారుడు రిషి( 7) కలిసి విశాఖపట్నం నుండి పి.గన్నవరం మండలం, పోతవరం సొంత గ్రామానికి చేరుకునే క్రమంలో కారులో వస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. రావులపాలెం మండలం ఈతకోట వద్ద భార్య డ్రైవింగ్ తీసుకుందని భర్త విజయ్ కుమార్ తెలిపారు, పెద్ద కుమారుడు మనోజ్, కారునుండి గట్టుకి చేరుకోక పోవడంతో ఒడ్డుకు వచ్చిన భార్య, చిన్న కుమారుడు, మనోజ్ ను రక్షించే సమయంలో మళ్లీ కాలువలో వెళ్ళ గా ముగ్గురు గల్లంతయ్యారని . భార్య ఉమా మృతదేహం పెద్ద కొడుకు మృతదేహాలు లభ్యం కాగా మరో చిన్న కొడుకు రిషి మృతదేహం లభ్యం కావలసి ఉంది . సంఘటన స్థలానికి స్థానిక ఎస్సై శివకృష్ణ బృందం సర్కిల్ ఇన్స్పెక్టర్ భీమరాజు ఎమ్మెల్యే గిడి సత్యనారాయణ మరియు అగ్నిమాపక అధికారులు చేరుకొని విచారణ చేపట్టారు.

## రాజవొమ్మంగిలో భారీ అన్న సమారాధన





**రాజవొమ్మంగి,మేజర్‌న్యూస్ :** రాజవొమ్మంగిలో భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక శ్రీ రామ్ నగర్‌లో శ్రీఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట జరిగి ఏడాది కావడంతోమొదటి వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని విగ్రహ దాత జామి అప్పారావు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. తొలి తగ శ్రీ ఆంజనేయ స్వామికి అప్పారావు దంపతులు, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొనిస్వామివారికి తమలపాకులు, పండ్లు,దూపదీప నైవేద్యాలు సమర్పించి పూజలు చేశారు. అనంతరం 500 మంది భక్తులకు అన్న ప్రసాదాలు అందజేశారు. కమిటీ సభ్యులు జామి అప్పారావు, కొర్రా నానాజీ, అదేపల్లి వీరబాబు, మండా రాంబాబు, పల్లి నూకరాజు, పల్లి నాగేశ్వరరావు, మండా బాబురావు, మండా నూకరాజు, విసంపల్లి నాగు, వెచ్చం బాబురావు, మండా సత్యనారాయణ పూజా కార్యక్రమం, అన్న సమారాధన కార్యక్రమం జరిపించారు.గొల్లపూడి పెద్దిరాజు, బి వి ఎస్ ఎన్ గుప్తా, కోడూరి రామరాజు గ్రామానికి చెందిన భక్తులు పాల్గొన్నారు.

సూర్య
తూర్పుగోదావరి
బుధవారం,
11 డిసెంబర్ 2024


## సానా సతీష్ బాబు పౌండేషన్ తరపున క్రికెట్ కిట్స్ అందజేత



**కాకినాడ, మేజర్ న్యూస్ :** నిత్యం పని వత్తిడితో సతమతం అయ్యే జర్నలిస్టులకు ఆట విడుపుగా క్రికెట్ టోర్నమెంటు అవసరమైన క్రికెట్ కిట్‌ను సానా సతీష్ బాబు పౌండేషన్ తరపున జర్నలిస్ట్ స్పోర్ట్స్ అసోసియేషన్ సభ్యులకు అందించినట్లు ఫౌండేషన్ ఛైర్మన్ తలాటం హరీష్ తెలిపారు. కాకినాడ టూటౌన్ మునిసబువీధిలోగల సానా సతీష్‌బాబు ఫౌండేషన్ కార్యాలయంలో జర్నలిస్టులకు క్రికెట్ కిట్ పంపిణీ కార్యక్రమం జరిగింది. సానా సతీష్ బాబు రాజ్యసభకు నామినేషన్ వేస్తున్న సందర్భంగా ఫౌండేషన్ ఛైర్మన్ తలాటం హరీష్, సభ్యుడు మంగా వెంకటశివరామకృష్ణ ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్ స్పోర్ట్స్ అసోసియేషన్ నాయకులు తోట సిద్దు బృందానికి అందజేసారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ఛైర్మన్ తలాటం హరీష్ మాట్లాడుతూ నిత్యం పని వత్తిడితో సతమతం అయ్యే జర్నలిస్టులకు క్రికెట్ టోర్నమెంట్ ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. సభ్యుడు శివరామకృష్ణ మాట్లాడుతూ జర్నలిస్టులు క్రికెట్ కిట్‌ను సద్వినియోగించుకోవాలన్నారు.

## జి.పి.డి.పి.2025-26కు శిక్షణపై అవగాహన



**అల్లవరం, మేజర్ న్యూస్ :** ఎంపిడిఓ కార్యాలయంలో మంగళవారం 2025-26 గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక రూపొందించే విధానంపై సర్పంచులు, ఎంపీటీసీ, అధికారులకు శిక్షణా కార్యక్రమంలో అప్లోడ్ చేయ వలసిన డేటా, వివరాలు మొదలగు అంశాలపై డిజిటల్ అసిస్టెంట్స్‌కు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్మెంట్ (ఎన్ఐఆర్‌డి) అధికారి శ్రీనివాసరావు, ఎంపిడిఓ బి.కృష్ణ మోహన్ వీరికి ట్రైనింగ్ మేనేజ్మెంట్ పోర్టల్‌లో హాజరు, ఈ సర్టిఫికెట్ డౌన్లోడ్ వంటి వాటి పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ బి.కృష్ణ మోహన్, ఎన్ఐఆర్‌డి అధికారి శ్రీనివాసరావు, డిజిటల్ అసిస్టెంట్స్ ప్రవల్లిక, బాబ్జీ, కర్రి శ్రీను, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# రెవెన్యూ, భూ సమస్యల పరిష్కారానికి చక్కటి వేదిక రెవిన్యూ సదస్సులు

**- గ్రామాల అభివృద్ధిలో రెవెన్యూ సదస్సులు కీలకపాత్ర పోషిస్తాయి**
**- ప్రణాళిక ప్రకారం జిల్లాలో నేటి నుంచి జనవరి 08, 2025 వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహణ**
**- పెద్దాపురం మండలం, గోరింట గ్రామంలో రెవెన్యూ సదస్సులు ప్రారంభించిన జిల్లా కలెక్టర్ షణ్మోహన్**

**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** రెవెన్యూ, భూ సమస్యల పరిష్కారానికి చక్కటి వేదిక రెవిన్యూ సదస్సులని జిల్లా వ్యాప్తంగా నేటి నుంచి ప్రారంభమైన రెవిన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మ కంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులకు సంబంధించి మంగళవారం కాకినాడ జిల్లా పెద్దాపురం నియోజకవర్గంలో పెద్దాపురం మండలం, గోరింట గ్రామం పెదరామాలయం వద్ద ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకినాడ జిల్లాలో నేటి నుంచి రెవెన్యూ సదస్సులు ప్రారంభించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా



ఈ నెల 06 నుంచి ప్రారంభమైన కాకినాడ జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలతో ఉన్నందున నాలుగు రోజులు ఆలస్యంగా ప్రారంభించడం జరిగిందని ఆయన తెలిపారు.

కాకినాడ జిల్లాలో ఈ నెల 10 నుంచి జనవరి 08, 2025 వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించేందుకు తగిన ప్రణాళిక సిద్ధం చేయడం జరిగిందన్నారు. గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించేందుకు రెవెన్యూ సదస్సులు కీలకపాత్ర పోషిస్తాయాని ఆయన అన్నారు. ప్రతి వారం నిర్వహిస్తున్న ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమంలో నూటికి 50శాతం అర్జీలు భూ వివాదాలు, రెవెన్యూ అంశాలకు సంబంధించిన దరఖాస్తులే ఉంటున్నాయన్నారు. వీటన్నిటిని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన భూ సమస్యలను పరిష్కారించే లక్ష్యంతో ప్రతి గ్రామంలోనూ ఈ రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందన్నారు. రెవెన్యూ, భూ సమస్యల పరిష్కారానికి చక్కటి వేదిక రెవిన్యూ సదస్సులు నిలుస్తాయని, రెవెన్యూ, రీ సర్వే విషయాలకు సంబంధించిన సమస్యలు మాత్రమే ఈ సదస్సులో చర్చించి, పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు.

తమ గ్రామంలో జరుగుతున్న రెవెన్యూ సదస్సులు ప్రతి ఒక్కరు సద్వినియం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ కోరారు. కార్యక్రమంలో పెద్దాపురం రెవెన్యూ డివిజన్ అధికారి కె.శ్రీరమణి, మాజీ మున్సిపల్ ఛైర్ పర్సన్ రాజా సూరిబాబు, గ్రామ సర్పంచ్ మెరికుమారి, తహసీల్దార్ సీహెచ్.వెంక టలక్ష్మి ఇతర అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఘనంగా మైసమ్మ ఆలయ వార్షికోత్సవం



**అల్లవరం, మేజర్ న్యూస్ :** సామంతకుర్రు గ్రామంలో కొలువై ఉన్న మైసమ్మ అమ్మవారి 13వ వర్షికోత్సవం ఘనంగా జరిగింది. వార్షికోత్సవం సందర్భంగా ఆలయాన్ని పూలమాలతో అలంకరి ంచారు. వేకువజాము నుండి భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వార్షికోత్సవం సందర్భంగా ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు.

## రాజ్యసభ సభ్యులుగా నామినేషన్ దాఖలు చేసిన సానా సతీష్



**కాకినాడ, మేజర్ న్యూస్ :** రాజ్యసభ సభ్యులుగా సానా సతీష్ నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు అచ్చెన్న నాయుడు, పి.నారాయణ, వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, టిడిపి నాయకులు గంధం పల్లంరాజు పాల్గొన్నారు.

## మానవ హక్కుల దినోత్సవ వేడుకలు



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** స్థానిక భవిత పాఠశాలలో జిల్లా మానవ హక్కుల పరిరక్షణ సంఘం అధ్యక్షులు నూతలపాటి అప్పలకొండ అధ్యక్షతన ఘనంగా జాతీయ మానవ హక్కుల దినోత్సవం జరుపుకోవడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల విద్యాశాఖ అధికారి 2 పి. పుల్లయ్య,మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్య హాజరైనారు. ఈ కార్యక్రమంలో అప్పలకొండ మాట్లాడుతూ మానవ హక్కులు కాపాడాలి అని మరియు ప్రతి వ్యక్తి హక్కుని కాపాడుకునే ఆలోచన కలిగి వుండాలి అని అన్నారు. ప్రతి వ్యక్తి మానవ హక్కులు కోలిపోవటం వలన ప్రభుత్వం ఆలోచన చేసి ఈ మానవ హక్కుల చట్టంను ప్రజలకు ఉపయోగపడేలాగా తీసుకు రావడం జరిగిందన్నారు. ఈ చట్టం ద్వారా పోలీసు,రెవిన్యూ, పంచాయతీ,మున్సిపల్ అధికారులు వల్ల గాని ఇతర శాఖ అధికారులతో ఏ విధమైన ఇబ్బందులు ఉన్నా అవన్నీ స్వయంగా రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ వారికి ఫిర్యాదు చేసి న్యాయం పొందటానికి అవకాశం ఉందన్నారు. అదే మాదిరిగా లోకల్ గా మీకు ఏదైనా సమస్యలు ఉంటే మా సంఘమునకు మీరు తెలియజేసినట్లయితే మీకు న్యాయం జరిగే వరకూ మేము మీకు అండగా ఉంటామని సహకరిస్తామని తెలిపారు. అలాగే ప్రతి వ్యక్తి మానవ హక్కులు పొందటానికి చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కుంచె నవిబాబు,స్.రెహమాన్,జుత్తిక అప్పారావు,ఎం.డి వల్లిభాష, ఎం.డి మున్వర్ మరియు సంఘ సభ్యులు,ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## జాప్యం లేకుండా ఎఫ్టిఓలు నమోదు చేయాలి

**- జిల్లా జాయింట్ కలెక్టర్**



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** ధాన్యం కొనుగోలులో రైతుల బిల్లులు చెల్లింపునకు సంభందించి ఫండ్ ట్రాన్ఫర్ ఆర్డర్ (ఎఫ్టిఓ)లను సకాలంలో అందించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ భావన ఆదేశించారు. మంగళవారం సామర్లకోట మండలం ఉండూరు, వీకే రాయపురం గ్రామాల్లో రైస్ మిల్లులు, రైతు భరోసా కేంద్రాలను జిల్లా ఆమె తనిఖీ చేశారు. ధాన్యం సేకరణ ప్రక్రియ గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అధికారి ఐ సత్య తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 15న గుంటూరులో జరిగే మాలల మాహాసభను విజయవంతం చెయ్యండి



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** ఈనెల 15న గుంటూరులో జరిగే మాలల మాహాసభను విజయవంతం చెయ్యాలని రాష్ట్ర మాలమహానాడు నాయకులు లింగం శివప్రసాద్, తదితరులు పిలుపునిచ్చారు. అఖిల భారత మాల సంఘాల జేఏసీ పెద్దాపురం నియోజకవర్గం ఎస్సీ ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీని ఏర్పాటు చేశారు. సామర్లకోట లయన్స్ క్లబ్‌లో జరిగిన దళిత సోదరులు ఆత్మీయ సమావేశంలో ఈనెల 15న జరగనున్న మహాసభ విజయవంతానికి అవసరమైన కార్యాచరణ రూపొం దించారు. ఈ సమావేశానికి పెద్దాపురం నియోజవర్గ పరిధిలోని దళితులను భారీగా తరలించాలని తీర్మానం చేశారు. ఈ సమావేశంలో ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు, దళిత సంఘాల నాయకులు పిట్టా జానకి రామారావు, పోలిపల్లి బాబీ, నేతల హరిబాబు, పిట్టా సత్యనారాయణ, వారా సుధాకర్, గొల్లపల్లి సత్యనారాయణ, కాళ్ల రవీంద్ర, మాజీ జెడ్పిటిసి బంగారు కృష్ణ, నూతటి అశోక్, మాల మహానాడు నాయకులు, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## యాన్యువల్ స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభించిన జిల్లా కలెక్టర్ షణ్మోహన్







**కాకినాడ రూరల్, మేజర్ న్యూస్ :** కాకినాడ గ్రామీణ మండలం పి.వెంకటాపురం వద్ద ఉన్న పీ.ఎం శ్రీ కేంద్రీయ విద్యాలయంలో నిర్వహిస్తున్న యాన్యువల్ స్పోర్ట్స్ మీట్ కు జిల్లా కలెక్టర్, కేంద్రీయ విద్యాలయ ఛైర్‌పర్సన్ షణ్మోహన్ సగిలి మంగళవారం ప్రారంభించారు. జాతీయ పతాకం ఆవిష్కరణ, జాతీయగీతం అనంతరం జిల్లా కలెక్టర్ క్రీడా జ్యోతిని వెలిగించి విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన మార్చ్ ఫాస్ట్‌కు ఆయన గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం యాన్యువల్ స్పోర్ట్స్ మీట్ ప్రారంభానికి గుర్తుగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్, కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ బొంతు శేఖర్ కపోతాలను ఎగురవేశారు. జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్జీఎఫ్ఐ) చెస్ పోటీలలో గోల్డ్ మెడల్ పొందిన పదోతరగతి విద్యార్థి సాయి గంగాధర్, కేంద్రీయ విద్యాలయం జాతీయస్థాయి షూటింగ్ పోటీల్లో నాలుగో స్థానంలో నిలిచిన తొమ్మిదవ తరగతి విద్యార్థిని ఏ.ఆశ్రీత, కేంద్రీయ విద్యాలయం రీజినల్ పోటీలలో మొదటి స్థానం సాధించిన హాకీ క్రీడాకారులను జిల్లా కలెక్టర్ షణ్మోహన్ చేతుల మీదుగా ప్రశంస పత్రాలు, మెడల్స్ అందజేశారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ క్రీడా పోటీలు విద్యార్థుల్లో నూతన ఉత్సాహాన్ని తీసుకు వస్తాయన్నారు. క్రీడలు శారీరక, మానసిక వికాసానికి దోహదం చేయడంతో పాటు విద్యార్థుల్లోని ఒత్తిడిని తొలగిస్తాయన్నారు. గెలుపోటములతో సంబంధం లేకుండా విద్యార్థుల చదువుతోపాటు క్రీడల్లో రాణించేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ ఈ సందర్భంగా విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో పీ.వెంకటాపురం గ్రామ సర్పంచ్ పి.సోమరాజు, పీ.ఎం శ్రీ కేంద్రీయ విద్యాలయ సీనియర్ ఉపాధ్యాయులు కే.విజయ శ్రీనివాసు, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## మెయిన్ రోడ్ పెద్దమసీదు వద్ద జీబ్రా క్రాసింగ్ ఏర్పాటు పరిశీలన


**- పౌరసంక్షేమ సంఘం వినతిపై సిఎం కార్యాలయ స్పందన**



**కాకినాడ, మేజర్ న్యూస్ :** కాకినాడ మెయిన్ రోడ్‌లోని (జామియా) పెద్ద మసీదులో ప్రార్థనల కోసం వెళ్లే వారు గంజాం వారి వీధి జంక్షన్ వద్ద రోడ్డు దాటే సమయంలో ట్రాఫిక్ అసౌకర్యాలు ప్రమాదాలు జరుగుతున్నందున జీబ్రా క్రాసింగ్ ఏర్పాటు చేయాలని పౌర సంక్షేమ సంఘం కోరింది. గత అక్టోబర్ లో సిఎం కార్యాలయానికి పంపిన 2 అంశాల లేఖపై జవాబుగా జిల్లా ఎస్‌పి నుండి కార్పోరేషన్ అధికారులు దృష్టికి రాగా కమీషనర్ ఆదేశాల మేరకు మంగళవారం సాయంత్రం కార్పోరేషన్ ఎఇ దేవీ లలిత ప్రత్యక్ష పరిశీలన నిర్వహించారు. పెద్ద మసీదు వద్ద జీబ్రా క్రాసింగ్ అవసరాన్ని గుర్తించారు. ఈ సందర్భంగా పౌర సంఘం కన్వీనర్ సామాజిక వేత్త దూసర్లపూడి రమణరాజు మాట్లాడుతూ ప్రతిరోజూ మసీదులో ప్రార్థనల కోసం వచ్చే సీనియర్ సిటిజన్స్, పిల్లలు మెయిన్ రోడ్ రద్దీ ట్రాఫిక్ నుండి రావడం వెళ్ళడం ప్రమాదకరంగా వున్నందున జీబ్రా క్రాసింగ్ ఏర్పాటు గుర్తించి ట్రాఫిక్ సౌకర్యం కల్పించాలని సిఎం కార్యాలయానికి వ్రాసిన లేఖలో పేర్కొన్న విషయాన్ని తెలియజేసారు. సూర్యారావుపేటలోని వివేకానంద పార్కు జవహర్ వీధి గేటును కరోనా లాక్‌డౌన్‌లో మూసేసి మూడేళ్లు అయ్యిందని, వృద్ధుల కోసం పార్కు వేళల ప్రకారం తెరవాలని అదే లేఖలో విజ్ఞప్తి చేయగా కార్పోరేషన్ డిఇఇ గత నవంబర్ 14న పరిశీలన చేసి ట్రాఫిక్ రిపోర్ట్‌కు పంపగా ఎటువంటి వివరణ ఇప్పటివరకు పిర్యాదుదారునికి తెలియపర్చ లేదన్నారు. ఈ అంశంపై సిఎం కార్యాలయం నుండి పరిష్కారం జరిగిందా లేదా అని తనను మరోసారి వివరణ కోరారని విషయాన్ని తెలియపర్చిన మేరకు ఆపై ఉన్నతాధికారికి పరిష్కారం కొరకు మరల పంపుతున్నామని గత 7వ తేదీన ఎస్ఎంఎస్ ద్వారా సమాచారం ఇచ్చారని తెలియజేసారు. ఎస్పి కార్యాలయం నుండి నాగమల్లి తోట జంక్షన్ వరకు వున్న పిఠాపురం రోడ్‌లోని స్మార్ట్ సిటీ సైకిల్ ట్రాక్ యధావిధిగా వుంచుతూ ప్లాస్టిక్ గొట్టాలు తొలగించడం ద్వారా ట్రాఫిక్ సౌకర్యాలు మెరుగుపర్చిన రీతిగానే వివేకానంద పార్కు వద్ద సైకిల్ ట్రాక్ యధావిధిగా ఉంచుతూ ప్లాస్టిక్ గొట్టాలు, రోడ్డు మీద సిమెంట్ పలకలు తొలగిస్తే ట్రాఫిక్ సౌకర్యాలు మెరుగవుతాయన్నారు. ట్రాఫిక్ అధికారులు ప్రజా ప్రయోజనాలు నెరవేర్చాలని కోరారు. ఈ మేరకు నగర డిఎస్‌పి రఘువీర్ విష్ణుతేజ్ ను కలిసి కోరగా ప్రజలకు మేలు చేసే రెండు అంశాలు తప్పకుండా అమలు చేయించే ప్రయత్నం చేస్తామని తెలిపారన్నారు. సంక్రాంతి పండుగల సందర్భంగా వివేకా నంద పార్కు జవహర్ వీధి గేటు ప్రవేశ మార్గం పునరుద్ధరణ చేయించాలని కోరారు.

## షెడ్యూల్ ప్రాంతాల్లో అదివాసులకు ఉద్యోగ భద్రత చట్టం తీర్మానం చేయాలి

**- ఆదివాసిసంక్షేమ పరిషత్ 3898/90 డిమాండ్**



**ఎటపాక,మేజర్‌న్యూస్ :** అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం డివిజన్లో ఎటపాక మండలం నెల్లిపాక గ్రామ పరిధిలో ఆదివాసి సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో 48 గంటల రిలే నిరాహార దీక్షలు ప్రారంభించడం జరిగింది దీక్షలను బంగారు, వెంకటేశ్వర్లు, తాటి రవి ప్రారంభించడం జరిగింది. ఈ దీక్షలు ఉద్దేశించి రాష్ట్ర అధ్యక్షులు బంగారు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ భారత రాజ్యాంగంలోని ఐదో షెడ్యూల్ ప్రాంత ంలో ఆర్టికల్ 24 (1) పేరా 5 (1) పేరలో మార్పులు చేర్పులు చేసి షెడ్యూలు ప్రాంతాలలోని ఉపాధ్యాయ, ఫారెస్ట్ డిపార్ట్మెంట్, పోలీస్ డిపార్ట్మెంట్, మెడికల్ డిపార్ట్మెంట్, రెవిన్యూ డిపార్ట్మెంట్ మరియు ఇతర శాఖలో ఉద్యోగాలను స్థానిక ఆదివాసి యువతీ యువకులతో భర్తీ చేయాలని ఎందుకంటే ఆదివాసులు అన్ని రంగాలలో వెనుకబడి ఉన్నారు కావున ఆదివాసుల కోసం ఏర్పాటుచేసిన అన్ని ఐటీడీఏలు ఆదివాసులు అభివృద్ధి గురించి ఆలోచించి ప్రభుత్వానికి నివేదికలను సమర్పించాలని, అలానే ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో ఉన్న ఆదివాసి ఎమ్మెల్యేలు తమ ప్రాంతంలో ఉన్న ఆదివాసియువతీ యువకుల కోసం ఉద్యోగ భద్రత చట్టాన్ని తీసుకురావడం కోసం కృషిచేయాలని పిలుపునిచ్చారు. ఆదివాసులకు భారత రాజ్యాంగం కల్పించబడ్డ వన్ ఆఫ్ సెవెంటీ, పిసా చట్టం, అటవీ హక్కుల చట్టాలు చట్టాలు ఉన్న షెడ్యూల్ ప్రాంతాలలో వాటి అమలు చేసే అధికారులు చాలా అరుదని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

రాష్ట్ర ప్రభుత్వం డిప్యూటేషన్ పేరుతో ఐటీడీలో పనిచేస్తున్న ఉద్యోగస్తులను మైదాన ప్రాంతాలలోకి డిప్యూటీషన్లో కల్పించడం వలన ఈ ప్రాంతంలో ఉన్న ఆదివాసి విద్యార్థులకు తీవ్రమైన అన్యాయం జరుగుతుందన్నారు. అలాగే గురుకుల పాఠశాల పనిచేస్తున్న ఉద్యోగస్తులకు జీతాలను సకాలంలో చెల్లిస్తూ ఇప్పుడు ఉన్న రేట్ల ప్రకారం వారికి కనీస వేతనం 25 నుంచి 30 వేల వరకు పెంచాలని డిమాండ్ చేశారు. పోలవరం ప్రాజెక్టు 2013 నిర్వాసితుల చట్టం ప్రకారం భూమికి భూమి ఇల్లు విద్యా వైద్యం నీళ్ల సదుపాయం కరెంటు సదుపాయాలు, ఆ దగ్గరలో స్కిల్ డెవలప్మెంట్ కేంద్రాలను ఏర్పాటుచేసి వారికి ఉపాధిని కల్పించాలని, చదువుకున్నవారికి పోలవరం విద్యుత్ ప్రాజెక్ట్‌లో ఉద్యోగాలు కల్పించాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు ఉమ్మల దుర్గారెడ్డి, మండల శాఖ మీడియం సురేష్, సవలం వెంకటేష్, గుండి లక్ష్మయ్య, కుంజ వినోద్, కురుసం రాజశేఖర్, తెల్లం నవీన్ బాబు, తాటి ముదిరాజు, గుండి అంజిబాబు, తెల్లం నాగరాజు, తెల్లం ముఖేష్, పూనం అంజిబాబు, పోడియం శ్యామల, తెల్లం జంపన్న తదితరులు పాల్గొన్నారు.

## అధిక లోడ్ ఇసుక లారీలను సీజ్ చేసిన రెవిన్యూ డివిజనల్ అధికారి రాణి సుస్మిత



**కొవ్వూరు, మేజర్ న్యూస్ :** కొవ్వూరు ఇసుక ర్యాంపుల నుండి ఏలూరుకు అధిక లోడ్‌తో వెళుతున్న రెండు ఇసుక లారీలను సీజ్ చెయ్యడం జరిగిందని రెవిన్యూ డివిజనల్ అధికారి రాణి సుస్మిత తెలిపారు. మంగళవారం కొవ్వూరు సమీపంలో అధిక లోడ్ తో వెళుతున్న రెండు లారీలను గమనించి, రికార్డులు పరిశీలించగా సదరు ఇసుక లారీలలో నిర్దేశించిన పరిణామం కంటే 10 మెట్రిక్ టన్నులు ఇసుకను అధికంగా లోడింగ్ చేసి ఏలూరుకు వెళు తున్నట్లు తెలిపారు. సంబంధిత లారీ యజమానులు పై, ఇసుక రవాణా చేస్తున్న వ్యక్తులపై ఎఫ్ ఐ ఆర్ నమోదు చెయ్యవలసినదిగా సంబంధిత అధికారులకు ఆదేశించడం జరిగిందనీ ఆర్డీవో తెలిపారు. వాహనాల్లో ఇసుక రవాణా చేసే సమయంలో నిర్దేశించిన లోడ్ కి మించి ఇసుక రవాణా చేస్తే అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీలో ఎమ్మార్వో ఎమ్. దుర్గా ప్రసాద్, ఏ ఎస్ ఐ శ్రీనివాస్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## పంచాయతీ కార్యదర్శులతో సమావేశం



**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** మండల పరిషత్ కార్యాలయం నందు మంగళవారం పంచాయతీ కార్యదర్శిలతో ఎంపీడీవో యాదగిరేశ్వరరావు సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో పరిశు ధ్యం నిర్వహించేలా చర్యలు చేపట్టాలని, మంచినీటి ట్యాంక్లను ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయించాలని, పంచాయతీలు పరిధిలో హౌస్ టాక్స్ వసూల్ చేయాలని, పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించాలని ఎంపీడీవో ఆదేశించారు.

## మానవ హక్కుల దినోత్సవం




**ఏలేశ్వరం, మేజర్ న్యూస్ :** ఏలేశ్వరం మండలం యర్రవరం విజ్ఞాన్ జ్యోతి కాలేజ్‌లో మానవ హక్కుల పై ప్రతి ఒక్కరికి అవగా హన ఉండాలని, ప్రతి ఒక్కరు వారి హక్కులను కాపాడుకోవాలనే ముఖ్య ఉద్దేశంతో మానవ హక్కుల దినోత్సవం స్పార్క్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు హ్యూమన్ రైట్స్ పై అవగా హన మరియు మానవ హక్కుల దినోత్సవ ప్రతిజ్ఞను 100 మంది విద్యార్థులతో నిర్వహించారు. అనంతరం ర్యాలీగా సమాజంలో అందరికీ అవగాహనకలిగించే లా మానవహారం నిర్వహించి అక్కడ ఉన్నవారుతో మానవ హక్కులను తెలియజేశారు. ఈ సందర్భంగా పార్క్ ఫౌండేషన్ ఛైర్మన్ సాయి సందీప్ మాట్లాడుతూ స్పార్క్ ఫౌండేషన్ బృందం రాష్ట్రంలో ఉన్న అన్ని కళాశాలలో మరియు యూనివర్సిటీలు మానవ హక్కుల పరిరక్షణకు, హక్కుల అణచివేత లేని సమాజ నిర్మాణం కోసం నిరంతరం సాగాల్సిన కృషికి గుర్తుగా ఈరోజును మానవ హక్కుల దినోత్సవంగా ప్రపంచమంతా పాటిస్తుందని. ఐక్యరాజ్యసమితి ఆమోదించిన డిసెంబరు 10న ప్రతి సంవత్సరం మానవ హక్కుల దినోత్సవంగా జరుపుకుంటారని అలాగే ప్రతి వ్యక్తీ, సమాజంలోని ప్రతి వ్యవస్థా ఈ ప్రకటనను నిరంతరం గమనంలో ఉంచుకుంటూ, విద్యాబోధనతో ఈ హక్కులు, స్వాతంత్ర్యాల పట్ల గౌరవాన్ని పెంపొందించటానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో స్పార్క్ కోఆర్డినేటర్ ఆదిత్య,విజ్ఞాన జ్యోతి కాలేజ్ కరస్పాండెంట్ వెంకట రమణ, నాగేశ్వరరావు అధ్యాపకులు, పోలీస్ డిపార్ట్మెంట్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఎక్సైజ్ దాడుల్లో 600లీ బెల్లపు ఊట ధ్వంసం



పెద్దాపురం, మేజర్ న్యూస్ : పెద్దాపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఎక్సైజ్ సిబ్బంది మంగళవారం జరిపిన దాడులలో గండేపల్లి మండలం మురారి గ్రామంలో సారాయి తయారీకి నిల్వ ఉంచిన సుమారు 600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి, కేసు నమోదు చేసినట్లు పెద్దాపురం ఎక్సైజ్ సీఐ అర్జునరావు తెలిపారు. ఈ దాడులలో పెద్దాపురం ఎక్సైజ్ ఎస్సైలు మరియు సిబ్బంది పాల్గొన్నట్లు సీఐ తెలిపారు.

## కె.ఎస్.ఆర్.ఎస్.జ్యోత్స్నకి జెఎన్టీయుకె పిహెచ్‌డి



**కాకినాడ, మేజర్ న్యూస్ :** నిపుణుల బృందం సిఫార్సు మేరకు కె.ఎస్.ఆర్.ఎస్.జ్యోత్స్న సిద్ధాంత వ్యాసం "ఎంఎల్-బేస్డ్ జిఎన్ఎస్ఎస్ సిగ్నల్ క్లాసిఫికేషన్ అండ్ అనాలిసిస్ ఆఫ్ మల్టీపాత్ ఎర్రర్ ఇన్ టెర్రెస్ట్రియల్ అండ్ ఓషన్ ఎన్విరాన్‌మెంట్స్" జెఎన్‌టియుకె అధికారులచే ఆమోద ముద్ర పొందినది.

ఈమెకు పిహెచ్‌డి 'డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ' అవార్డు ఎలక్ట్రానిక్స్ & కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ (ఈసిఈ) విభాగంలో లభించినది.

కె.ఎస్.ఆర్. ఎస్.జ్యోత్స్న తన సిద్ధాంత వ్యాసాన్ని కాకినాడలోని జెఎన్‌టియుకె యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కాకినాడ (యుసిఇకె) ఈసిఈ విభాగం ప్రొఫెసర్ డా.కె.పద్మరాజు మరియు తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌లోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సిబిఐటి) ఈసిఈ విభాగం ప్రొఫెసర్ & ఆర్&డి అడ్వయిజర్ డా. ఎ.డి.శర్మ ఆధ్వర్య పర్యవేక్షణలో సమర్పించారు.

# 20 నుండి ఎస్.ఎం.ఎస్ సభ 147వ వార్షిక సదస్సులు

**కాకినాడ,మేజర్‌న్యూస్ :** తిరుపతి సమీపాన ఉన్న తిరుచానూర్ దివ్య క్షేత్రంలో శ్రీమన్ మధ్వ సిద్ధాంతోన్నాహిని సభ 147వ జాతీయ వార్షిక మాధ్వ సభలు ఈనెల 20 నుండి మూడు రోజులు పాటు జరుగుతోందని సభ గౌరవ కార్యదర్శి ఆర్. అనంతన్ (త్రిపూర్) తెలిపారు. ఈ సభలను 20వ తారీకు ఉదయం ఎనిమిది గంటలకు సుధా పండితులు డాక్టర్ సత్య ధ్యానాచార్ కట్టి(బెంగళూర్) జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించగా మూడు రోజులు పాటు నిర్వహించే సభ విషయాలను సుధా పండితులు విద్యాధీశాచార్ గుత్తల్ (బెంగళూర్) వివరిస్తారు. ఆరోజు ఉదయం నాలుగు న్నరగంటల నుండి సుప్రభాత కార్యక్రమం జరుగుతుంది. అనంతరం ఐదు 45 నుండి హరి వాయి స్తుతి మరియు సుమధ్య విజయ పారాయణ, అనంతరం ఏడు గంటల నుండి తిరుచానూర్ క్షేత్రంలో పద్మసరోవరం, ఆంజనేయస్వామి దేవస్థానం, పద్మావతి అమ్మవారు మరియు ఇతర దేవాలయాల ప్రదక్షణగా వేద మంత్రాల ఘోషతో మరియు భజన కార్యక్రమం జరుగుతుంది. సభ ప్రారంభం అనంతరం ఉపనయన కార్యక్రమం జరుగుతుంది. ఈ మూడు రోజులు పాటు ఎండోమెంట్ స్పెషల్ ప్రసంగాల నిమిత్తం సుమారు 26 మంది పండితులచే వివిధ అంశాలపై ప్రవచన కార్యక్రమం జరుగుతుందన్నారు. సుధా పండితులు పద్మనాభచార్య చిటగుప్ప (హైదరాబాద్), డా॥ పం సత్యధ్యానాచార్ కట్టి (బెంగళూరు),



పండిత పాండురంగచార్య రొట్టి (బెంగళూరు), పండిత వెంకటగిరీషాచార్య, పండిత బాదరాయణాచార్య, పండిత శ్యామాచార్ బండి, పండిత వాదిరాజాచార్యకరణం, పండిత నరసింహచార్య కొత్తే, పండిత రఘువీరాచార్య చండీ, పండిత లక్ష్మీనారాయణ చార్య, పండిత రంగాచార్య జోషి, పండిత భీమాచార్య ఆతనూర్ (బెంగళూరు), పండిత శ్రీనిధి ఆచార్య మదనపల్లి, పండిత పవమాన ఆచార్య కల్లాపుర (బెంగళూరు), పండిత విశ్వ ప్రజ్ఞాచార్య మాహూలి (ముంబై), పండిత పవనాచార్య హునగుండా, పండిత సరవేశాచార్య పేరూర్, పండిత రఘోత్తమాచార్య నాగసంపంగి, పండిత వాదిరాజాచార్య ఎల్.ఎస్., పండిత భీమాటి విజయింద్రాచార్, పండిత కృష్ణాచార్య ఖేడా (బెంగళూర్), పండిత విద్యాధీశాచార్ గుత్తల్ (బెంగళూర్), పండిత వేదవ్యాసాచార్ ఖేడా (బెంగళూర్), పండిత విద్యా సింహాచర్ మహులీ (ముంబై), పండిత ఆనందాచార్య దివాన్జీ, పండిత మధ్వాచార్య మూఖాశీ, పలువురు వివిధ అంశాలపై ప్రవచనాలు చేస్తారని అనంతన్ వివరించారు. దీంతోపాటు తిరుపతి ఇతర ప్రాంతాలకు చెందిన మహిళ భజన మండలి బృంద సభ్యులచే విశేష భజన కార్యక్రమం జరుగుతుందన్నారు. 21 రాత్రి 8:30 గంటల నుండి 10 గంటల వరకు మైసూర్ కి చెందిన శ్రీ రామచంద్ర చార్ స్వీయ పర్యవేక్షణలో దాసుల కీర్తనల భజన కార్యక్రమం విశేషంగా జరుగుతుందని చెప్పారు. 22వ తారీకు ఉదయం తొమ్మిది గంటల నుండి శ్రీ సత్యనారాయణ పూజా కార్యక్రమం జరుగుతుందని భక్తులందరూ పాల్గొనవలసిందిగా ఆయన కోరారు. ఇతర వివరాలకు 0877-2239725లో సంప్రదించవచ్చు అన్నారు. అందరూ పాల్గొని ఈ విశేష కార్యక్రమాలను విజయవంతం చేయవలసిందిగా అనంతన్ విజ్ఞప్తి చేశారు.

## నాగమ్మ పుట్టను దర్శించుకున్న మంత్రి దుర్గేష్



**పెరవలి, మేజర్ న్యూస్ :** కానూరు కాపుల వినాయకుడి గుడి వద్ద నూతనంగా ప్రతిష్టించిన నాగమ్మ పుట్టను రాష్ట్ర పర్యాటక సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ డిసెంబర్ 10వ తేదీ మంగళవారం స్థానిక నాయకులతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కానూరు కాపుల ఐక్యమత్యంతో వివిధ సామాజిక సేవలు చేస్తున్నారని అందువల్ల వారు ఏ కార్యక్రమానికి పిలిచినా తాను హాజరవుతూ ఉంటానని వీరికి ఏ అవసరం ఉన్న నేను వెన్నంటే ఉంటానని ఆయన పేర్కొన్నారు. తదుపరి కాలనీలో గంధం వారి వివాహ వేడుక లో పాల్గొన్నారు. తదుపరి కానూరు పెండ్యాల రోడ్డులో ఉన్న దానమ్మ గుడి వద్ద లారీ ఓనర్స్ అసోసియేషన్ వారి వనసమరాధన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు ఆలం సుబ్బారావు, చోడపనిడి నరసింహమూర్తి, సాధనాల శ్రీనివాస్, కొమ్మిశెట్టి రామకృష్ణ, రంకిరెడ్డి ప్రసాద్, కోలా సీతయ్య నాయుడు, చింటూ, అంబటి బ్రహ్మయ్య, బూరుగుపల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

## మానవ హక్కుల పరిరక్షణకు కృషి చేయాలి

**- సీనియర్ సివిల్ జడ్జి దీపా దైవకృప**




**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** సమాజంలో మానవ హక్కుల పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని సెషన్స్ కోర్టు సీనియర్ సివిల్ జడ్జి దీపా దైవకృప తెలిపారు. డిశంబర్ 10 అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా మహారాణి కళాశాలలో ప్రిన్సిపల్ డా.జి.జ్యోతిర్మయి అధ్యక్షతన విద్యార్థులకు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు.

ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా సీనియర్ సివిల్ జడ్జి దీపా దైవకృప, పెద్దాపురం ఎస్సై వి.మౌనిక, పాల్గొన్నారు. సీనియర్ సివిల్ జడ్జి దీపా దైవకృప విద్యార్థులకు రాజ్యాంగంలోని ఆర్టికల్ 12 నుంచి 36 వరకు గల ప్రాథమిక హక్కుల గురించి, వివరించారు. రాజ్యాంగంలో హక్కులతో పాటు విధులు కూడా ఉన్నాయని, వాటిని తప్పక ఆచరించిననాడే హక్కులు పొందే అవకాశం ఏర్పడుతుందన్నారు. భారత రాజ్యాంగం సమాజంలో ప్రతీ ఒక్కరూ నడవవలసిన విధి విధానాలు తెలియపరిచే ఒక గ్రంథం అని ఆమె పేర్కొన్నారు. ఎస్సై మౌనిక మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని, విద్యార్థి జీవితంలో కళాశాల స్థాయి అత్యంత ప్రధానమైనదని, ఎటువంటి చెడు వ్యసనాలకు బానిస కాకుండా సత్ప్రవర్తన కలిగి ఉండాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు అత్తిలి ప్రభూజీ, మడికి రాంబాబు, దుర్గాప్రసాద్, పలువురు న్యాయవాదులు, కళాశాల అద్యాపకులు, పారా లీగల్ వలంటీర్లు, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## రెండవ రోజుకు చేరిన మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ సమ్మె



**పెద్దాపురం, రూరల్, మేజర్‌న్యూస్ :** తమ డిమాండ్ల సాధనకై సమ్మె మంగళవారం నాటికి రెండవ రోజు చేరుకుంది. ఈ సమ్మెలో ఇంజనీరింగ్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం నాయకులు సుంకర నాగేశ్వరరావు, రమణ, వాకాడ భాస్కర్, ప్రశాంత్, ఆకుల రామకృష్ణ, సోని, సత్తిరాజు, శివకోటి సాయి, గుడిసి నాగేశ్వరరావులు పాల్గొని మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఔట్‌సోర్సింగ్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ పిలుపు మేరకు సమ్మె చేస్తున్నామన్నారు.

టెక్నికల్, నాన్ టెక్నికల్‌కు జీతం రూ.29,200 నుండి రూ.24,200 ఇవ్వాలని, 15 సం.లు పైబడిన కార్మికులను క్రమబద్ధీకరించాలని, 55 ఆదివారాలు, 17 దేశ, జాతీయ, రాష్ట్ర పండుగల 72 రోజులను సెలవులగానైనా ప్రకటించాలని, లేదా వేతనదారులుగా ప్రకటించాలని, విధి నిర్వహణలో చనిపోయిన కార్మికులకు రూ.10 లక్షల రూపాయలు, అలాగే అంగవైకల్యం పొందినవార్కి రూ.5 లక్షలు ఇస్తూ, కుటుంబంలో ఒక్కరికి ఉద్యోగం ఇవ్వాలని, సీనియార్టి ప్రాతిపదికన జీతాలు చెల్లించాలని, హెచ్.ఆర్. పాలసీ అమలు చేయాలని, కార్మికులము కాబట్టి మాకు కూడా సంక్షేమ పథకాలు అమలు చేయాలని వంటి డిమాండ్లతో సమ్మె బాట పట్టినట్లు వారు తెలిపారు.

ఈ కార్యక్రమంలో పలువురు మున్సిపల్ ఇంజనీరింగ్, ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ పాల్గొన్నారు.

# ఘనంగా జిల్లా కోర్టు ప్రారంభం



రామచంద్రపురం, మేజర్ న్యూస్ : కోర్టుల ప్రాంగణంలో మంగళవారం వైభవోపేతంగా అదనపు జిల్లా మరియు సెషన్స్ కోర్టు వర్చువల్‌గా హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాగూర్ ప్రారంభించారు. వర్చువల్ విధానంలో ఆయన మాట్లాడుతూ రామచంద్రపురంలో అదనపు జిల్లా కోర్టు నెలకొల్పడం చాలా సంతోషదాయకమని, కక్షిదారులకు మరింత సౌలభ్యంగా వుంటుందన్నారు. గతంలో కక్షిదారులు 60 కిలోమీటర్ల దూరం కోర్టుకు వెళ్ళవలసి వచ్చేదని ఈ కోర్టు ఏర్పాటుతో ఆ సమస్యకు పరిష్కారం లభించిందని ఆయన అన్నారు. ఎందరో మహానుభావులు అల్లూరి సీతారామరాజు లాంటి స్వాతంత్ర సమరయోధులు చదువుకున్న ప్రాంతం రామచంద్రపురం అని కొనియాడారు ఇక్కడ జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేసిన జస్టిస్ జగన్నాథరాజు, జస్టిస్ ఇమ్మంది పాండురంగారావులు హైకోర్టు జడీలుగా పదోన్నతి పొందారన్నారు. జిల్లా పోర్టుఫోలియో జడ్జి అయినాల జయసూర్య మాట్లాడుతూ జూనియర్ న్యాయవాదులకు ఈ కోర్టు పునాది వేసిందని తెలిపారు. భవిష్యత్తులో న్యాయవాదులందరూ కక్షిదారులకు న్యాయం చేసి కేసులు త్వరతగతిని పూర్తి చేస్తారని ఆశిస్తున్నామన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత గంధం మాట్లాడుతూ దశాబ్దాలుగా ఇక్కడ జిల్లా కోర్టు నెలకొల్పాలని న్యాయవాదులు చేస్తున్న పోరాటానికి నేటితో తెరపడిందన్నారు. న్యాయవాదులందరూ ఐకమత్యంగా ఉండి న్యాయ సహాయాన్ని అందించాలన్నారు. సుమారు 8 మండలాలు10 పోలీస్ స్టేషన్ లకి సంబంధించి అనపర్తి ఆలమూరు కోర్టులకు సంబంధించి ఆపిల్స్ అన్ని ఈ కోర్టులోనే ఇకపై దాఖలు చేసుకోవచ్చని ఆమె తెలిపారు. తొలుత మంగళ వాయిద్యాలు వేదమంత్రాలతో జిల్లా ప్రధాన న్యాయమూర్తిని బార్ అసోసియేషన్ కార్యవర్గం సీనియర్, జూనియర్, మహిళా న్యాయవాదులు, స్థానిక న్యాయమూర్తులు ఆమెకు స్వాగతం పలికారు. న్యాయదేవత విగ్రహానికి ఆమె పూలమాలలు వేశారు. అనంతరం రాష్ట్ర ప్రధాన న్యాయమూర్తి గౌరవ జస్టిస్ ఠాకూర్ డిజిటల్ ఇనాగరేషన్ జరిపి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కాకినాడ నాలుగవ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి ఎం.హరి నారాయణ ఈ కోర్టు నిర్వహించే బాధ్యతలు అప్పగించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేశ్వరరావు, జూనియర్ సివిల్ జడ్జి నిజాంశారద, ఎడిషనల్ జూనియర్ సివిల్ జడ్జీ. వి.నాగేశ్వరరావు నాయక్, బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు పిల్లి మురళీమోహన్, వెంకటరమణ, సాయి ప్రసాద్ వాడ్రేవు, ఉపాధ్యక్షులు పలివెల సత్యనారాయణ, డి.ఎస్.ఎస్.శర్మ, సంయుక్త కార్యదర్శి చిన్నం వీర్రెడ్డి, కోశాధికారి జె.చక్రవర్తి, జూనియర్స్ న్యాయవాదుల ప్రతినిధి పిల్లా పృథ్వి, మహిళా న్యాయవాదుల ప్రతినిధి కె.వి.సత్యవాణి, సీనియర్ న్యాయవాదులు ఎం.సర్వారాయుడు, పిల్లా సూర్య ప్రకాశరావు, డి.పి.శాస్త్రి, వి.వి.ఆర్. సుబ్రహ్మణ్యం, ఇనకోటి గంగాధర్, అల్లం గంగరాజు, కోటిపల్లి లోవరాజు, ఆర్.వి.జి.సుబ్బారావు, పోలిశెట్టి శ్రీనివాస్, వాకలపూడి జయశంకర్, కొండేపూడి భరత్ కుమార్, చిప్పాడ గోవిందాచార్యులు, జూనియర్ సీనియర్ మహిళా న్యాయవాదులు, పబ్లిక్ ప్రోసిక్యూటర్లు ఎం.ప్రకాష్, రామ తులసి తదితరులు పాల్గొన్నారు.

## గ్రామంలోని ప్రజలంతా సైబర్ నేరాలు మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**- సీఐ వైఆర్‌కె శ్రీనివాస్**



**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** మన్యంవారి పాలెం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జగ్గంపేట సీఐ వైఆర్‌కె శ్రీనివాస్, ఎస్ఐ టి.రఘునాథరావు ఆధ్వర్యంలో విద్యార్థిని, విద్యార్థులకు మహిళా రక్షక్ కార్యక్రమం ద్వారా బాలికల రక్షణ, మహిళల చట్టాల పట్ల, అవగాహన కల్పించారు అదేవిధంగా గ్రామ ప్రజలకు చట్టాల పట్ల, దొంగతనాల నివారణ గురించి, సైబర్ నేరాలు,ఆన్లైన్ మోసాలు, రోడ్డు ప్రమాదాల పట్ల అవగాహన సదస్సు నిర్వహించారు. సైబర్ మోసాల పట్ల స్క్రీన్ ద్వారా వీడియోలు ప్రదర్శించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ వైఆర్‌కె మాట్లాడుతూ సైబర్ నేరలలో భాగముగా ఆన్లైన్ మోసాలు,ఫేక్ లోన్స్ మోసాలు,ఆన్లైన్ జాబ్స్/వర్క్ డిజిటల్ అరెస్టు పోక్సో చట్టం గురించి 112, 1930 కాల్స్ యొక్క ఉపయోగములు గురించి ప్రజలకు అవగాహన కల్పించారు.ప్రస్తుతం సైబర్ నేరాలు గ్రామాలలోని ప్రజలకు సెల్ఫోన్ ద్వారా లింకులు పంపించి మీయొక్క ఎకౌంట్లో నగదును దోచుకుంటున్నారని ప్రతి ఒక్కరూ సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా, అపరిచిత వ్యక్తులు పంపించే ఆన్లైన్, వాట్స్‌అప్ లింకులను క్లిక్ చేయకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. అదేవిధంగా డిజిటల్ అరెస్టులో, ఆన్లైన్ వస్తువుల కొనుగోలు, ఆన్లైన్ మోసాల పట్ల గ్రామస్తులకు అవగాహన కల్పించారు.

గ్రామస్తులంతా రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలన్నారు.మోటార్ సైకిల్స్ నడిపే ప్రతి ఒక్కరు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలన్నారు. మైనర్ డ్రైవింగ్ చేయరాదన్నారు. పరిమితికి మించి వాహనాలు వేగంగా నడపరాదన్నారు.మద్యం సేవించి వాహనాలు నడపడం వలన కలుగు ప్రమాదాలు గురించి క్షుణ్ణంగా గ్రామస్తులకు వివరించారు. ముఖ్యంగా గ్రామంలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడరాదన్నారు. కోడిపందాలు, పేకాట, బొమ్మ బొరుసు, నెంబర్ గుండు వంటి జూదాలు ఆడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. అదేవిధంగా ఇంట్లో ఎవరూ లేకుండా అందరూ పగలైనా, రాత్రి అయినా బయటికి వెళ్తున్నప్పుడు ఇంట్లో విలువైన ఆభరణాలు ,క్యాష్ ఉంచ రాదని ఎక్కువ కాలం ఊరికి వెళుతున్నప్పుడు పోలీసు వారికి తెలియజేస్తే ప్రత్యేకంగా నిఘా పెడతామని, ఎల్ హెచ్ ఎం ఎస్ ఫెసిలిటీ ఉపయోగించుకోవాలన్నారు. గ్రామంలో లైసెన్స్ లేని ప్రైవేటు చిట్స్ జోలికి పోకుండా ఉండాలని, అపరిచితులు ఎవరైనా గ్రామం లోనికి వస్తే పోలీసు వారికి సమాచారం ఇవ్వాలని, యువత తప్పు దోవ పట్టకుండ నివరించుటలో పెద్దలు పోలీసు వారికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మన్యంవారి పాలెం గ్రామ సర్పంచ్ పోట్రు వీర్రాజు, గ్రామ టిడిపి అధ్యక్షుడు పోట్రు రాము, టిడిపి నాయకులు పోట్రు కృష్ణ, బొడ్డు ఎరుకరాజు,పోట్రు వెంకట సత్యనారాయణ, పోట్రు వీర్రాజు, నెమ్మది నరసింహమూర్తి, కొండ్రాపు ప్రసాద్, గొల్ల గాని వెంకటరమణ, గజ్జల రాముడు,పోట్రు అప్పారావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఇండోనేపాల్ గేమ్స్‌కి సెలక్ట్ అయిన షావోలిన్ డ్రాగన్ విద్యార్థులు







**- అభినందించిన పలువురు**

**రాజమహేంద్రవరం,మేజర్‌న్యూస్ :** ది షావోలిన్ డ్రాగన్ టైగర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మార్షల్ ఆర్ట్స్ అండ్ స్పోర్ట్స్ అకాడమీ నుంచి ఇండో నేపాల్ గేమ్స్‌కి సెలెక్ట్ అయిన తమ విద్యార్థులను పలువురు ప్రముఖులు అభినందించినట్లు ఆ అకాడమీ ఫౌండర్ మరియు గ్రాండ్ మాస్టర్ బి. సామ్యూల్ రాజు తెలిపారు. రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్, రాజమండ్రి ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు తదితరులు అభినందించినట్లు ఆయన తెలిపారు.

## "మానవ హక్కుల" పై న్యాయ విజ్ఞాన సదస్సు




**రాజమహేంద్రవరం, మేజర్‌న్యూస్ :** మంగళవారం తూర్పు గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి మరియు సీనియర్ సివిల్ జడ్జ్ కె. ప్రకాష్ బాబు , ఆర్డీవో ఆర్ కృష్ణ నాయక్ లతో కలిసి మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా స్థానిక దానవాయిపేటలోని ఐ.సి.డి.ఎస్ ఆఫీసు నందు "మానవ హక్కుల" పై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భం గా న్యాయమూర్తి ప్రకాష్ బాబు మాట్లాడుతూ ఎవ్వరికీ స్వేచ్ఛ, సమానత్వం, న్యాయం నిరాకరించబడరాదని అన్నారు. హక్కులు లేని మనిషి బానిసతో సమానం అన్నారు . ఎందుకంటే మానవుడు స్వతంత్రంగా జీవించి, తన మనుగడ కాపాడుకోవడానికి హక్కులు ఊతమిస్తాయి. ప్రతి ఒక్కరూ ఎలాంటి వివక్షకు గురికాకుండా సమాన హక్కులతో జీవించాలని అన్నరు. ఎవరికి ఎలాంటి న్యాయ సమస్యలు, సందేహాలు ఉన్నా జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని అన్నారు.

ఈ సదస్సులో రాజమహేంద్రవరం ఆర్.డి.ఓ. ఆర్ కృష్ణ నాయక్ మాట్లాడుతూ, రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కు కల్పించడం అధికారులు బాధ్యతాయుతమైన పాత్రను పోషించాల్సి ఉంటుందన్నారు. అనంతరం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి మరియు సీనియర్ సివిల్ జడ్జ్ కె. ప్రకాష్ బాబు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో హిట్ అండ్ రన్ యాక్సిడెంట్ కేసుల పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి ప్రకాష్ బాబు మాట్లాడుతూ హిట్ అండ్ రన్ యాక్సిడెంట్ కేసుల్లో బాధితులకు పరిహారం అందించే విషయంలో గౌరవ సుప్రీం కోర్టు వారి ఆదేశాలను అనుసరించాలని అన్నారు.

డిశంబరు 14 న జరగబోవు జాతీయ లోక్ అదాలత్ నందు పరిష్కార యోగ్యమున్న వీలైనన్ని ఎక్కువ కేసుల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని తెలియచేసారు. ఈ కార్యక్రమంలోఐ.సి.డి.ఎస్ పి.డి. కె. విజయ కుమారి, సి.డి.పి.ఓ నర్సమ్మ , అంగన్వాడీ టీచర్స్, ఆషా వర్కర్స్, ఎ.ఎన్.ఎమ్ లు, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా లో ని ఆర్.డి.ఒ లు, రంపచోడవం మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్, రాజమహేంద్రవరం ట్రాఫిక్ డి.ఎస్.పి తదితరులు పాల్గొన్నారు.

## పింఛన్ల వెరిఫికేషన్ విజయవంతం



**అల్లవరం, మేజర్ న్యూస్ :** అల్లవరం మండలం గోడి సచివాలయం పరిధిలో జిల్లాలోనే పైలట్ బేసిస్‌గా మంగళవారం చేపట్టిన పింఛన్ల వెరిఫికేషన్ ప్రక్రియ విజయవంతం అయ్యింది. జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో, డిఆర్‌డిఏ పిడి డా.శివ శంకర ప్రసాద్ ప్రత్యక్ష మానిటరింగ్‌లో వివిధ వివిధ మండలాల నుండి వచ్చిన 10 మంది ఈఓఆర్డీలు, వెల్ఫేర్ అసిస్టెంట్స్ 10 బృందాలుగా గ్రామంలో పింఛన్లు పొందుతున్న పింఛనుదారుల వద్దకు వెళ్లి ప్రత్యేక యాప్‌లో వివరాలు, డాక్యుమెంట్స్, రిమార్క్స్ నమోదు పూర్తి చేశారు. మొత్తం పింఛన్లు 403, డెత్స్-4, అందుబాటులో లేనివి-6, మిగిలిన అన్ని పింఛన్లు వెరిఫై చేసి యాప్‌లో నమోదు చేశారు.

ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఏ పిడి డా.శివ శంకర ప్రసాద్, డిపిఎం అన్న పూర్ణ, స్థానిక కార్యదర్శి సాయి బాబు, సచివాలయం సిబ్బంది, టీం సభ్యులు పాల్గొన్నారు.